విద్యార్థులకు యోగాపై శిక్షణ

విశాలాంధ్ర-తాడేపల్లి : తాడేపల్లి శాఖ గ్రంథాలయంలో మంగళవారం సమ్మర్ క్యాంపులో భాగంగా గ్రంథాలయ అధికారి షేక్ నాగురు భాష ఆధ్వర్యంలో యోగా క్లాసులు నిర్వహించారు. ముఖ్య అతిథిగా కుంచనపల్లి హైస్కూల్‌కి చెందిన యోగ మాస్టారు బి.నాగేశ్వర రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు క్రమశిక్షణ ఆత్మవిశ్వాసం జ్ఞాపకశక్తి పెంచడానికి యోగ ప్రాణయామం ఎంతో ముఖ్యమని అన్నారు. పిల్లలు ప్రతిరోజు ఉదయాన్నే ఇది పాటిస్తే మంచి ఏకాగ్రతతో చదువుకుంటారని అన్నారు. ఇకనుంచి ప్రతిరోజు ఉదయం పూట 30 నిమిషాలు యోగ ప్రాణయం క్లాసులు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ అధికారి నాగూర్ భాష తెలిపారు.

హెచ్ఐవీ బాధిత కుటుంబాల విద్యార్థులకు శిక్షణ

విశాలాంధ్ర-తాడేపల్లి : నవజీవన్ బాల భవన్ ఆధ్వర్యంలో ఎంటీఎంసీ పరిధిలోని పెనుమాకలో చిగురు బాలల గ్రామంలో హెచ్ఐవీ బాధిత కుటుంబాల విద్యార్థులకు వేసవి శిక్షణా శిబిరం ఏర్పాటు చేసారు. ఈ కార్యక్రమంలో నవజీవన్ బాల భవన్ ప్రోగ్రాం మేనేజర్ గోళ్ళమూడి శేఖర్ బాబు మాట్లాడుతూ వేసవి శిక్షణా శిబిరంలో బోధనా అభ్యాసం, విద్యార్థుల శక్తిసామర్థ్యాల మెరుగుదలకు క్యాంపు ఏర్పాటు చేశామని తెలిపారు. మాదక ద్రవ్యాల దుర్వినియోగంపై అవగాహనా, మానసిక ఉల్లాసం కోసం ప్రతి రోజు డాన్స్ మాస్టర్ ద్వారా డాన్స్‌లను నేర్పించటం, ప్రతి రోజు ఆటలు నిర్వహించామని తెలిపారు. నవజీవన్ బాల భవన్ జోనల్ కోఆర్డినేటర్ జె.ఆంజనేయులు, జె.వాణి, సైకాలజిస్ట్ జి.అనూష, డాన్స్ మాస్టర్ నవీన్, వలంటీర్లు హైమావతి, శ్రీనివాసరావు, దుర్గ, రాణి తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని యువకుడి మృతి

విశాలాంధ్ర-చేబ్రోలు: రైలు ఢీ కొని యువకుడు మృతి చెందిన సంఘటన సంగం జాగర్లమూడి రైల్వే స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. రైల్వే పోలీస్‌లు తెలిపిన వివరాలు చేబ్రోలు మండలం గరువుపాలెం సమీపంలోని సంగంజాగర్లమూడి రైల్వే స్టేషన్ వద్ద మంగళవారం పెదకాకాని మండలం అనుమర్లపూడి గ్రామానికి చెందిన వెంకటేశ్వరావు (23) రైల్వే ట్రాక్ దాటుతున్న సమయంలో తెనాలి నుంచి గుంటూరు వైపు వెళ్లు తున్న రైలు ఢీ కొనటంతో వెంకటేశ్వరావు అక్కడికక్కడే మృతి చెందారు. గుంటూరు జీఆర్‌పీఎఫ్ ఎస్ఐ టి. శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వలంటీర్లకు వందనం

విశాలాంధ్ర-ఫిరంగిపురం : వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని మండలంలోని మెరికపూడి, పొనుగుపాడు, గుండాలపాడు, బేతపూడి, ఎర్రగుంట్లపాడు సచివాలయ వలంటీర్లకు సన్మాన కార్యక్రమము జరిగింది. సర్పంచ్ పి.మల్లేశ్వరి, ఎంపీపీ, ఎంపీడీఓ, ఉపసర్పంచ్ పద్మావతి, గ్రామ పార్టీ అధ్యక్షులు బ్రహ్మరెడ్డి, వెంకటరామిరెడ్డి, వీరారెడ్డి, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ఊటీకి ఆర్టీసీ స్పెషల్ టూర్ ప్యాకేజీ

విశాలాంధ్ర-గుంటూరు : గుంటూరు, పరిసర ప్రాంత ప్రయాణికులకు సమ్మర్ స్పెషల్ టూర్ ప్యాకేజీ సౌకర్యం కల్పించినట్లు ఏపీఎస్ఆర్టీసీ గుంటూరు-2 డిపో మేనేజర్ ఎస్‌కే అబ్దుల్ సలామ్ ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు నుంచి ఊటీకి ఏసీ ఇంద్ర, నాన్ ఏసీ సూపర్ లగ్జరీ స్పెషల్ బస్‌లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. గుంటూరులో ఈ నెల 27 సాయంత్రం 4 గంటలకు ఏసీ ఇంద్ర బస్, సాయంత్రం 5.45 గంటలకు సూపర్ లగ్జరీ బస్ బయలుదేరుతాయని, 28న మధ్యాహ్నానికి మైసూర్ చేరి భోజన అనంతరం మైసూర్‌లోని మైసూర్ ప్యాలస్, బృందవన గార్డెన్స్, ఇతర ముఖ్య ప్రదేశాలను చూసుకుని 29న ఉదయం 6 గంటలకు మైసూర్‌లో బయలుదేరి, మధ్యాహ్నానికి ఊటీ చేరి 30 మధ్యాహ్నం వరకూ ఊటీలోనే ఉండి, ఊటీలో ఉన్న రోజ్ గార్డెన్స్, టీ ఎస్టేట్, ఊటీ లేక్, బోటనికల్ గార్డెన్స్, ఇతర ముఖ్య ప్రదేశాలను చూసి ఆ రోజు రాత్రి అక్కడే బస చేసి 30న ఊటీలో మధ్యాహ్నం లంచ్ చేసుకొని, ఊటీ నుంచి బయలు దేరి 31 ఉదయం 8 గంటలకు గుంటూరు చేరుతుందని వివరించారు. వివరాలకు 7382897459, 7382896403, 9959225421 నెంబర్‌లలో సంప్రదించాలని కోరారు.

తాగునీటి సరఫరాలో అంతరాయం

విశాలాంధ్ర-గుంటూరు : నగరంలో తాగునీటి సరఫరాపై ప్రజల నుంచి అందిన ఫిర్యాదుల మేరకు, లీకులు మరమ్మతులు చేసి మెరుగైన సరఫరా అందించేలా చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ ఆదేశాల మేరకు నెహ్రూనగర్ నుంచి లక్ష్మీపురం సరఫరా జరిగే 800 డయా పైప్ లైన్‌కు సంజీవయ్య నగర్ రైల్వే గేటు వద్ద ఏర్పడిన లీకు మరమ్మతులను బుధవారం చేపడుతున్నట్లు నగరపాలక సంస్థ ఎస్ఈ పీవీకే భాస్కర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నెహ్రూనగర్ రిజర్వాయర్ నుంచి హెచ్ఎల్ఆర్‌కు తాగునీరు సరఫరా ప్రస్తుతం 800 ఎంఎం డయా పైప్ లైన్‌పై సంజీవయ్య నగర్ రైల్వే గేటు వద్ద లీకు ఏర్పడి తాగునీరు వృధాగా పోతుందని, సదరు లీకును బుధవారం ఉదయం సరఫరా అనంతరం మరమత్తు చేయడానికి యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశామన్నారు. లీకు మరమత్తు పనుల వలన నగరంలోని పశ్చిమ నియోజకవర్గంలో బుధవారం ఉదయం సరఫరా యధావిదిగా జరుగుతుందని, సాయంత్రం సరఫరా జరిగే ప్రాంతాల్లో అంతరాయం కల్గుతుందని తెలిపారు. గురువారం ఉదయం నుంచి సరఫరా యధావిధిగా జరుగుతుందన్నారు. బుధవారం సాయంత్రం పశ్చిమ నియోజకవర్గంలోని లక్ష్మిపురం, స్తంభాలగరువు, గుజ్జనగుండ్ల, ఏటీ అగ్రహారం, ఏఎంసీ, హౌసింగ్ బోర్డు, కోర్టు కాంపౌండ్, కేవీపీ కాలని, వికాస్ నగర్, శ్యామల నగర్, హనుమయ్య నగర్ తదితర ప్రాంతాల్లో త్రాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని, ప్రజలు సహకరించి ముందుగా తగిన ఏర్పాట్లు చేసుకోవాలని కోరారు.

చంద్రబాబు సమాధానం ఇవ్వాలి

విశాలాంధ్ర-మంగళగిరి : రాజధాని ప్రాంతంలో పేదవారు, కష్టపడి పని చేసుకునేవారు ఉండకూడదనేదే చంద్రబాబు ఆలోచన అని, కోర్టు మొట్టికాయలు వేసినా చంద్రబాబు ఇంకా వక్ర భాష్యం మాట్లాడుతుండడం సిగ్గుచేటని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున అన్నారు. సీఆర్‌డీఏ పరిధి కృష్ణాయపాలెంలోని ఆర్ 5 జోన్‌లో పేదలకు కేటాయించిన ఇళ్ల స్థలాల లే-అవుట్ అభివృద్ధి పనులను మంగళవారం ఆయన ఎంపీ నందిగం సురేష్, మాజీమంత్రి వెలంపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్సీలు డొక్కా మాణిక్య వరప్రసాద్, లేళ్ల అప్పిరెడ్డిలతో కలిసి పరిశీలించారు. అనంతరం మంత్రి మేరుగ నాగార్జున మాట్లాడుతూ చంద్రబాబు చెంప చెళ్ళుమనిపించే విధంగా ఈ నెల 26వ తేదీన సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేతుల మీదుగా 50వేల మందికి పైగా పేదలకు ఈ ప్రాంతంలో ఇళ్ల పట్టాలు ఇవ్వడం నిజంగా వారందరి అదృష్టమన్నారు.

26న ఇంటర్వ్యూలు

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : గుంటూరు ప్రభుత్వ వైద్య కళాశాలలో సీనియర్ రెసిడెంట్స్ నియామకం కోసం ఈ నెల 26వ తేదీన ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్.ఉమాజ్యోతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్లినికల్, నాన్ క్లినికల్ స్పెషాలిటీస్, సూపర్ స్పెషాలిటీస్ రంగాల్లో అర్హత గల అభ్యర్థులు నేరుగా ఇంటర్వ్యూకు హాజరు కావలసిందిగా ఆమె కోరారు.

ఉపాధ్యాయ బదిలీల్లో అసంబద్ధ నిర్ణయాలను సవరించాలి: ఎస్టీయూ

విశాలాంధ్ర-గుంటూరు : రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ఉపాధ్యాయ బదిలీల్లో అసంబద్ధ నిర్ణయాలను సవరించాలని ఎస్టీయూ రాష్ట్ర పూర్వ అధ్యక్షులు సిహెచ్ జోసెఫ్ సుధీర్ బాబు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గుంటూరు కంకరగుంట వద్ద గల ఎస్టీయూ భవన్‌లో జిల్లా అధ్యక్షులు గేరా మోహనరావు అధ్యక్షతన ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులపై మంగళవారం సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జోసఫ్ సుధీర్ బాబు మాట్లాడుతూ ప్రమోషన్లు, బదిలీల విషయంలో విద్యాశాఖ వైఖరి, జారీ చేస్తున్న ఉత్తర్వులు ఉపాధ్యాయులను తీవ్ర ఆందోళనకు గురి చేస్తున్నాయని పేర్కొన్నారు. విద్యాశాఖ మంత్రి సమక్షంలో జరిగిన చర్చలకు అనుగుణంగా బదిలీల జీఓ 47లో మార్పులు చేయాలని, ప్రమోషన్లపై స్పష్టమైన విధానాన్ని ప్రకటించాలని డిమాండ్ చేశారు. ప్లస్ 2 పాఠశాలల్లో బోధించేందుకు అంగీకారం తెలిపిన ఉపాధ్యాయులకు ఒక ఇంక్రిమెంటు ఇస్తామని చెప్పి ఇప్పుడు అందుకు సమానమైన వేతనాన్ని అలవెన్స్ ఇస్తామంటున్నారని తెలిపారు. విద్యాశాఖ మంత్రి సమక్షంలో జరిగిన చర్చల్లో అంగీకరించిన అంశాలు సైతం చేర్చలేదని పేర్కొన్నారు. తాత్కాలిక ప్రమోషన్లు కాకుండా పూర్తిస్థాయి రెగ్యులర్ ప్రమోషన్లు ఇవ్వాలని, సర్వీస్ నిబంధనల ప్రకారం రెండు ఇంక్రిమెంట్లతో కూడిన ఆర్థిక ప్రయోజనాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కేటగిరి 1, 2, 3లలో ఖాళీ పోస్టులు బ్లాక్ విధానాన్ని రద్దు చేయాలని కోరారు. ఎయిడెడ్ ఉపాధ్యాయులకు పాత సర్వీసుకు కూడా స్టేషన్ పాయింట్లు 50 శాతం కేటాయించాలని డిమాండ్ చేశారు. ఉత్తర్వుల్లో అసంబద్ధాలను సవరించకపోతే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఉపాధ్యాయ ఖాళీల భర్తీ కోసం తక్షణమే డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల నమోదు తేదీని 2023 ఏప్రిల్ 30గా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చందా నరసింహారావు, ఆర్థిక కార్యదర్శి సిహెచ్ వెంకటేశ్వరరావు, నాయకులు డీఏ జోసెఫ్, పేరేచర్ల శ్రీనివాసరావు, జి.జోజప్ప, వై.శ్యాంబాబు, కేవీ రమణ, ఎం.శ్రీనివాసరావు, రహంతుల్లా తదితరులు పాల్గొన్నారు.

బదిలీల జీఓలో స్పష్టతనివ్వాలి

విశాలాంధ్ర-గుంటూరు : ఉపాధ్యాయ బదిలీల జీఓ 47లో వివిధ అంశాలకు స్పష్టత కొరవడిందని, సర్ప్లస్, కన్వర్షన్, పదోన్నతలపై స్పష్టతనివ్వాలని ఏపీటీఎఫ్ ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.బసవలింగారావు, మక్కెన శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. బదిలీల షెడ్యూల్ కేవలం 19 రోజులే ఉన్నదని షెడ్యూల్ సమయం పెంచాలని కోరారు. ప్రధానంగా జీఓ 47లో పలు అంశాలపై స్పష్టత లేదని అన్నారు. పదోన్నతల గురించి లేదని, బదిలీల తరువాత పదోన్నతలు ఇస్తే ఖాళీగా మిగిలే అవకాశం ఉంటుందని, లాంగ్ స్టాండింగ్, సర్ప్లస్, వారు ప్లస్2 కోరుకుంటే... వాళ్ళు బదిలీల కౌన్సెలింగ్‌లో అప్లై చేయాలా వద్దా, కన్వర్షన్ ఇచ్చిన వారి గురించి లేదు.. రూ.2500 అలవెన్సు సబ్జెక్ట్ టీచర్స్ గురించి లేదు... వెనక్కి వెళ్ళమని లేదు... వారి స్థానంలో ఎంటీఎస్ వారు చేరారు.. వారు బదిలీకి ఏ కేడర్‌లో పెట్టుకోవాలి. ప్రిఫరెన్సిల్ కెటగిరీలో స్పౌస్‌కి కూడా అవకాశం ఇవ్వాలి. మెడికల్ బోర్డ్ ఏర్పాటు చేయుటకు సమయం పడుతుంది.. కానీ రేపటి నుంచి ఆన్‌లైన్‌లో ధరఖాస్తు చేయమన్నారు. గడువు పెంచాలి లేదా గత డిసెంబర్‌లో తీసుకున్న మెడికల్ సర్టిఫికెట్ అలౌ చేయాలి.. జీఓ సర్వీస్ ఇచ్చిన కారణంగా షెడ్యూల్ సమయం పెంచాలి.. బదిలీలకు ఏ ఒక్క ప్లేస్ బ్లాక్ చేయకుండా అన్ని ఖాళీలు చూపాలి, బదిలీలు.. ముందుగా హెచ్ఎస్ హెచ్ఎంల బదిలీలు... పదోన్నతలు ఎస్ఏ బదిలీలు... పదోన్నతలు ఎస్‌జీటీ బదిలీలు చివరగా.. జరిపితేనే అందరకీ న్యాయం జరుగుతుంది.. రేషనలైజేషన్ లేక రీ..అపోర్షన్మెంట్.. అయిన వారికి 5 పాయింట్స్‌తో పాటు ఓల్డ్ స్టేషన్ పాయింట్స్‌పై క్లారిటీ ఇవ్వాలి. కట్ ఆఫ్ డేట్‌ను 2022 ఆగస్టు 31 కాకుండా 23 మే 31గా చూడాలి... దాని ప్రకారం రేషనలైజేషన్ చేయాలి. జీఓ 117ను రద్దు చేసి రేషనలైజేషన్ చేయాలి తదితర వాటన్నింటిపై స్పష్టత ఇవ్వడానికి సంఘాలతో సమావేశం జరపాలని కోరారు. అప్పటి వరకు షెడ్యూల్ పొడిగించాలని డిమాండ్ చేశారు.

ఏపీ నుంచి నేరుగా హజ్ యాత్ర

విశాలాంధ్ర-మంగళగిరి : మొట్టమొదటి సారిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి యాత్రికులు నేరుగా హజ్ యాత్రకు వెళ్లేందుకు ఎంబార్కింగ్ పాయింట్ సాధించామని ఉపముఖ్యమంత్రి, మైనార్టీ శాఖ మంత్రి అంజాద్ బాషా ఆనందం వ్యక్తం చేశారు. మంగళవారం మంగళగిరిలోని ఏపీఐఐసీ కార్యాలయంలో మొదటి ఫ్లోర్‌లోని సీసీఎల్ఏ కాన్ఫరెన్స్ హాల్‌లో మైనార్టీ శాఖ సెక్రటరీ ఎ.ఎం.డి. ఇంతియాజ్, హజ్ కమిటీ ఛైర్మన్ బి.ఎస్. గౌస్ లాజమ్ ఆధ్వర్యంలో జరిగిన హజ్ కమిటీ సమన్వయ సమావేశంలో అంజాద్ బాషా ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తొలిసారిగా గన్నవరం ఎయిర్ పోర్టులో ఏర్పాటు చేసిన ఎంబార్కేషన్ పాయింట్ నుంచి 1,813 మంది యాత్రికులను నేరుగా పవిత్ర హజ్ యాత్రకు పంపడం జరుగుతుందన్నారు. 2023 జూన్ 7 నుంచి 2023 జూన్ 19 వరకు కొనసాగనున్న హజ్ యాత్రలో భాగంగా ప్రతి రోజూ 155 మంది యాత్రికులు హజ్ యాత్రకు వెళ్లేలా ఏర్పాట్లు చేశామన్నారు. కొత్తగా ఎంబార్కేషన్ పాయింట్ వచ్చాక వివిధ ఎయిర్ లైన్స్ ఏపీ నుంచి యాత్రికులను హజ్‌కు తీసుకెళ్లి మళ్లీ హజ్ నుంచి ఏపీకి తీసుకువచ్చే విధంగా ఇప్పటికే టెండర్లు పిలవడం జరిగిందన్నారు. హైదరాబాద్, బెంగుళూరు ఎంబార్కేషన్ నుంచి వెళ్లే ప్రతి ఒక్క యాత్రికుడి మీద రూ.80 వేలు అదనంగా భారం పడుతున్న పరిస్థితుల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాలకనుగుణంగా ఢిల్లీ వెళ్లి కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి సింథియా, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి స్మృతి ఇరానీతో చర్చించి హజ్ యాత్ర టికెట్ ధరను తగ్గించాలని కోరామన్నారు. తగ్గించలేని పరిస్థితుల్లో తమ రాష్ట్రం నుంచి హజ్‌కు వెళ్లే యాత్రికులను హైదరాబాద్, బెంగుళూరు నుంచి వెళ్లే విధంగా అనుమతించాలని కోరామన్నారు. ఈ విషయమై పరిశీలిస్తామని కేంద్రమంత్రులు చెప్పినట్లు అంజాద్ బాషా వెల్లడించారు. ప్రభుత్వానికి మంచి పేరు తెచ్చేలా వివిధ శాఖల అధికారులంతా సమన్వ యంతో పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో శాసనసభ్యులు, హజ్ కమిటీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ సభ్యులు ఎం.నవాబ్ బాషా, ఎమ్మెల్సీ, హజ్ కమిటీ సభ్యులు ఇసాక్, మైనార్టీ శాఖ సలహాదారు ఎస్ఎం జియావుద్దీన్, ఏపీ హజ్ కమిటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ నవాబ్ ఖాదర్ సాబ్, కృష్ణా జిల్లా కలెక్టర్ పి.రాజబాబు, ఎన్టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ సంపత్ కుమార్, హజ్ యాత్రకు సేవలందిస్తున్న వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్ శారదాదేవి విస్తృత పర్యటన

విశాలాంధ్ర-తాడేపల్లి : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఈ నెల 26వ తేదీన పర్యటన ఉండడంతో ఎంటీఎంసీ కమిషనర్ శారదాదేవి అన్ని శాఖల అధికారులతో కలసి మంగళవారం వివిధ ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాడేపల్లిలోని నివాసం నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎన్టీఆర్ కరకట్ట మీదుగా బకింగ్ హామ్ కెనాల్ ఎక్స్ క్లూయిస్ మీదుగా అమరావతి కట్టమీదుగా వెళ్లనున్నారు. ఈ మార్గంలో ఏమైనా ఆక్రమణలు ఉన్నాయా అన్న విషయాన్ని పరిశీలించి రెండు మూడు చోట్ల పందిర్లు ఉన్నట్లు గమనించి వాటిని తొలగించాలని సూచించామని, అమరావతి కరకట్ట వెంబడి జంగిల్ క్లియరెన్స్ ప్రారంభించామని అన్నారు. పట్టాల పంపిణీ కార్యక్రమానికి లక్ష మందికిపై వస్తారని అంచనా వేస్తున్నామని, వారి రాకకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా రహదారులను పరిశీలిస్తున్నామని ఆమె తెలిపారు. ఈ పరిశీలనా కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ హేమమాలిని, అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతి, టౌన్ ప్లానింగ్ ఏసీపీ వెంకటేశ్వర్లు, డీఈ కృష్ణారెడ్డి, ఏఈలు కిషోర్, ప్రవీణ్, రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన సాంబశివరావు అంత్యక్రియలు

విశాలాంధ్ర-దుగ్గిరాల : మండల పరిధిలోని తుమ్మపూడి గ్రామానికి చెందిన సీపీఎం సీనియర్ కమ్యూనిస్టు నాయకులు వల్లభనేని సాంబశివరావు సోమవారం గుండెపోటుతో కన్నుమూశారు. ఈ నెల 20న గుండెపోటు రావడంతో తెనాలి తరలించగా అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడ రమేష్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స చేసినప్పటికీ పరిస్థితి విషమించడంతో ఆయన మృతి చెందారు. సాంబశివరావుకు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. మంగళవారం తుమ్మపూడిలో అంత్యక్రియలు చేపట్టారు. రాష్ట్ర సీపీఎం నాయకులు వి.శ్రీనివాసరావు, డి.రమాదేవి, సిహెచ్ బాబురావు, మాజీ పార్లమెంట్ సభ్యులు పి.మధు హాజరై సాంబశివరావు భౌతికకాయంపై పార్టీ జెండాను కప్పి, పూలమాలవేసి నివాళులర్పించారు. అదేవిధంగా శాసనమండలి సభ్యులు కేఎస్ లక్ష్మణరావు, విద్యావేత్త సూర్యదేవర బుజ్జి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బి.వెంకట్, డి.సుబ్బారావు, మంగళగిరి నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, మంగళగిరి సీపీఐ మండల కార్యదర్శి జాలాది జాన్ బాబు, మండల బీజేపీ అధ్యక్షులు చుండూరు ఉమామహేశ్వరరావు, సీపీఎం ఎంఎల్ లిబరేషన్ పార్టీ సభ్యులు లోకం భాస్కరరావు, సీపీఎం నాయకులు జెట్టి బాలరాజు, యార్లగడ్డ బ్రహ్మేశ్వరరావు, మన్నవ నాగమల్లేశ్వరరావు, ఏమినేని స్టాలిన్, భీమవరపు అమ్మిరెడ్డి, వై.వెంకటేశ్వరరావు, కె.ప్రభాకర్ రెడ్డి, పాశం రామారావు, ఈమని అప్పారావు, జొన్న శివశంకర్, టీడీపీ నాయకులు చిలువూరు శేషగిరి, ఏమినేని కోటేశ్వరరావు, నర్రా శ్రీనివాసరావు, వివిధ పార్టీల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. సాంబశివరావు అంతిమయాత్రలో సుమారు 700 మంది పాల్గొన్నారు.

సీఎం జగన్‌మోహన్ రెడ్డికి ఘన స్వాగతం

విశాలాంధ్ర-గుంటూరు : గుంటూరు నగరానికి మంగళవారం విచ్చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి గుంటూరులోని పోలీస్ పెరేడ్ గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్ద రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి మెరుగ నాగార్జున, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని, శాసనమండలి ప్రభుత్వ చీఫ్ విప్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి, గుంటూరు జిల్లా ఎస్పీ ఆరిఫ్ హాఫిజ్, శాసనమండలి సభ్యులు లేళ్ళ అప్పిరెడ్డి, మురుగుడు హనుమంత రావు, చంద్రగిరి ఏసురత్నం, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ హెనీ కత్తెర క్రిస్టినా, నగరపాలక సంస్థ మేయర్ కావటి మనోహర నాయుడు పుష్పగుచ్చాలు అందించి స్వాగతం పలికారు. రాష్ట్ర ముఖ్యమంత్రికి జగన్‌మోహన్ రెడ్డికి పుష్పగుచ్చాలు అందించిన వారిలో మాజీ మంత్రులు డొక్కా మాణిక్య వరప్రసాద రావు, మేకతోటి సుచరిత, శాసనసభ్యులు అన్నాబత్తుని శివకుమార్, కిలారి వెంకట రోశయ్య, జిల్లా సంయుక్త కలెక్టర్ జి.రాజ కుమారి, రాష్ట్ర శాలివాహన కుమ్మరి కార్పొరేషన్ చైర్మన్ ఎం.పురుషోత్తం, కృష్ణ బలిజ, పూసల కార్పొరేషన్ చైర్‌పర్సన్ కోలా భవాని మణికంఠ, గ్రంథాలయ పరిషత్ చైర్మన్ ఎం.శేషగిరి రావు, జీడీసీసీ బ్యాంక్ ఛైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు, మాజీ పార్లమెంట్ సభ్యులు మోదుగుల వేణుగోపాల్ రెడ్డి, గుంటూరు రెవెన్యూ డివిజనల్ అధికారి ప్రభాకర రెడ్డి, గుంటూరు నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్లు వనమా వజ్రబాబు, షేక్ సజీలా ఉన్నారు.

మద్దాళి గిరి కుటుంబాన్ని పరామర్శించిన సీఎం

గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్(గిరి) కుటుంబాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మంగళవారం పరామర్శించారు. ఎమ్మెల్యే మాతృమూర్తి శివపార్వతి సోమవారం కన్నుమూసిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో గుంటూరు శ్యామలానగర్‌లోని ఎమ్మెల్యే మద్దాళి గిరి నివాసంలో శివపార్వతి చిత్రపటానికి సీఎం నివాళులర్పించారు. మద్దాళి గిరి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. నోట్: ఈ వార్తకు యాడస ఆబ్లిగేషనః ఉంది. దయచేసి ఫొటోతో ప్రచురించగలరు.

ప్రతి పార్లమెంట్ సెగ్మెట్‌లో మూడు స్థానాలు కేటాయించాలి

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్ : ఏ రాజకీయ పార్టీ అయినా బీసీలకు ప్రతి పార్లమెంట్ సెగ్మెంట్‌లో మూడు స్థానాలు కేటాయించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి కుమ్మర క్రాంతి కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం గుంటూరులోని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర యువజన కార్యాల యంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కుమ్మర క్రాంతి కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో రాజకీయ పార్టీలన్నీ బీసీల జపం చేస్తున్నాయని, కానీ ఏ పార్టీ కూడా బీసీ డిక్లరేషన్ చేయలేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో బీసీలే వెన్నెముక అని దొంగ ప్రచారాలు చేసుకుని గెలిచిన తర్వాత బీసీలకు నమ్మక ద్రోహం చేస్తున్నారని దుయ్యబట్టారు. ఏ రాజకీయ పార్టీ అయినా బీసీలకు 50శాతం టికెట్లు ఇస్తానని ఇప్పటికీ చెప్పిన దాఖలాలు లేవని, పలు పార్టీలు బీసీ రౌండ్ టేబుల్ సమావేశాలు, సదస్సులు పెట్టి మీ సమస్యలు చెప్పండి అని అనడం సిగ్గుచేటన్నారు. అలాగే రాబోయే ఎన్నికలలో ఎక్కడైతే బీసీలకు టికెట్ కేటాయించరో అక్కడ బీసీలను ఏకగ్రీవంగా నిలబెట్టి ఆ పార్టీలను ఓడిస్తామని హెచ్చరించారు. దానికి సంబందించిన కార్యాచరణ త్వరలో ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన చెప్పారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి కొల్లూరి హనుమంతరావు పాల్గొన్నారు.

నీలం సంజీవరెడ్డి, ప్రకాశం పంతులు నిస్వార్ధ సేవానిరతులు

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : మాజీ రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డి, మాజీ ముఖ్యమంత్రి, ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు నిస్వార్ధ సేవా నిరతులు అని అవగాహన సంస్థ సభ్యులు కొనియాడారు. స్థానిక అవగాహన సంస్థ కార్యాలయంలో నీలం సంజీవరెడ్డి జయంతి, ప్రకాశం పంతులు వర్ధంతి కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఉపాధ్యా ఉద్యమ నేత ఏవీ రామారావు మాట్లాడుతూ నీలం సంజీవరెడ్డి ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి విశేషంగా కృషి చేశారని కొనియాడారు. న్యాయవాది అవధానుల హరి మాట్లాడుతూ ప్రకాశం పంతులు నిస్వార్ధంగా ప్రజా శ్రేయస్సు కోసం పని చేసిన తీరు నేటికీ ఆదర్శప్రాయమేనన్నారు. ప్రజల కోసం చేసే సేవలో తను ఎన్ని ఇబ్బందులు పడినా నమ్మిన విలువల కోసం పని చేసి చిరంజీవిగా తెలుగు వారి హృదయాల్లో నిలిచిపోయారని తెలిపారు. అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి కూడా వీరి గురించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జనార్ధనరావు, సాయిరాం, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

జేపీ సంస్థపై జనసేన ఫిర్యాదు

విశాలాంధ్ర-తాడేపల్లి : గుండిమెడ ఇసుక క్వారీలో గడువు ముగిసిన తర్వాత కూడా జేపీ సంస్థ అక్రమంగా క్వారీ నిర్వహణపై చర్యలు తీసుకోవాలని జనసేన పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ చిల్లపల్లి శ్రీనివాసరావు, తాడేపల్లి మండల అధ్యక్షులు సామల నాగేశ్వరరావులు తాడేపల్లి పోలీస్ స్టేషన్లో మంగళవారం ఫిర్యాదు చేశారు. అనంతరం చిల్లపల్లి శ్రీనివాసరావు మీడియాతో మాట్లాడుతూ వారం రోజుల క్రితం గుండిమేడ ఇసుక క్వారీలో జరుగుతున్న అక్రమ ఇసుక తవ్వకాలు వెంటనే ఆపాలని డీఎస్పీకి వినతిపత్రం ఇవ్వగా వారు మూడు రోజుల్లో విచారణ జరిపి నివేదిక అందజేస్తానని తెలిపారు. కానీ ఇప్పటికీ వారం రోజులైనా ఎలాంటి సమాచారం ఇవ్వలేదని పైగా ఇసుక తవ్వకాలు ఆపకుండా వారికి కాపలాగా పోలీసులు ఉంటూ ఇసుక తవ్వకాలు అడ్డుకున్న జనసేన నాయకులను మూడు రోజుల క్రితం అరెస్టులు చేసినట్లు తెలిపారు. మరో మూడు రోజుల్లో వివరణ ఇవ్వకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఇసుక క్వారీల వద్ద పెద్ద ఎత్తున ధర్నాలు నిర్వహిస్తామన్నారు. రాష్ట్రంలో పోలీసులు వైసీపీ కార్యకర్తల్లాగా దొంగలకు కాపలాగా ఉంటూ ప్రజల సమస్యలను మాత్రం పట్టించుకోవటం లేదని విమర్శించారు. జేపీ సంస్థకు అనుమతి అయిపోయిన కూడా నిబంధనలకు విరుద్ధంగా గుండిమేడ ఇసుక క్వారీలో జరుగుతున్న అక్రమ ఇసుక తవ్వకాలపై మంగళవారం తాడేపల్లి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. గుండిమెడలో జరుగుతున్న అక్రమ ఇసుక క్వారీ గురించి పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలిపారు. ఇప్పటికైనా పోలీసు వారు వెంటనే విచారణ జరిపి అక్రమ ఇసుక తవ్వకాలను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గుంటూరు జిల్లా సంయుక్త కార్యదర్శి బడే కోమలి, ఎంటీఎంసీ ఉపాధ్యక్షులు శెట్టి రామకృష్ణ, తాడేపల్లి మండల ప్రధాన కార్యదర్శి లాల్ చంద్, పెనుమాక గ్రామ అధ్యక్షులు గిరిబాబు, ఉండవల్లి గ్రామ అధ్యక్షులు సిగిరిశెట్టి రాజా రమేష్, చిర్రావూరు గ్రామ ఉపాధ్యక్షులు అడపా విజయ్, ఉండవల్లి గ్రామ ప్రధాన కార్యదర్శి రాము, జనసేన పార్టీ యువ నాయకులు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర గుంటూరు జిల్లా

మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ

విశాలాంధ్ర-మంగళగిరి : మహిళల జీవనోపాధి, ఆదాయ మార్గాలను పెంచడమే లక్ష్యంగా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ స్త్రీశక్తి కార్యక్రమాన్ని ప్రారంభించారని రాష్ట్ర అధికార ప్రతినిధి తమ్మిశెట్టి జానకీదేవి అన్నారు. స్త్రీశక్తి కార్యక్రమంలో భాగంగా మంగళగిరి టౌన్, మంగళగిరి రూరల్ మండలంలో కుట్టు మిషన్‌లో శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు మంగళగిరి ఎమ్మెస్సెస్ భవన్‌లో నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలు ఆరుద్ర భూలక్ష్మి ఆధ్వర్యంలో మంగళవారం సర్టిఫికెట్లు, కుట్టు మిషన్లను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తమ్మిశెట్టి జానకీదేవి మాట్లాడుతూ నారా లోకేష్ సహకారంతో ఇప్పటి వరకు నియోజకవర్గంలో 12 బ్యాచ్‌ల ద్వారా మహిళలకు కుట్టు మిషన్‌లో శిక్షణ ఇచ్చి 480 కుట్టు మిషన్లను ఉచితంగా అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు మహిళ ప్రధాన కార్యదర్శి ఆకుల జయసత్య, నియోజకవర్గ తెలుగు మహిళ ప్రధాన కార్యదర్శి మంచికలపూడి వైష్ణవి, మంగళగిరి పట్టణ తెలుగుమహిళ అధ్యక్షురాలు ఊట్ల దుర్గమల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ సంస్థను సందర్శించిన ప్రసన్నకుమార్

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : పౌర గ్రంథాలయ శాఖ డైరెక్టర్ డాక్టర్ ప్రసన్న కుమార్ స్థానిక అరండల్‌పేటలోని జిల్లా కేంద్ర గ్రంథాలయం, జిల్లా గ్రంథాలయ సంస్థను మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్షన్ రిజిస్ట్రేషన్‌ను పరిశీలించారు. గ్రంథాలయంలోని అన్ని విభాగాలను, వేసవి విజ్ఞాన శిబిరాలను సందర్శించి విద్యార్థినీ, విద్యార్థులను వేసవి శిక్షణా తరగతులలో ఏమి నేర్చుకోనుచున్నారో అడిగి తెలుసుకున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్ మాట్లాడుతూ డైరెక్టర్ డాక్టర్ ప్రసన్న కుమార్ గుంటూరు జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థను సందర్శించటం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి(ఎఫ్ఏసీ) కె.ఝాన్సీ లక్ష్మీ, లైబ్రేరియన్స్ కె.చిన్నపరెడ్డి, ఎన్.నాగిరెడ్డి, జూనియర్ అసిస్టెం ట్స్ వై.బ్రహ్మయ్య, జి.శ్రీనివాసులు, టైపిస్టు కె.శ్రీనివాసరావు, జి.రాజేష్, కె.పూర్ణ చందరావు, రికార్డు అసిస్టెంట్ ఎం.సంజయ్, టి.విజయ్ కుమార్, ఆఫీస్ సబార్డినేట్స్ పి.కోటేశ్వరి, వెంకట్రావు, జి.కళ్యాణి, జి.అచ్చమ్మ తదితరులు పాల్గొన్నారు.

నవంబర్ 1 నుంచి నిరవధిక సమ్మె

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ప్రభుత్వ ఉద్యో గుల సమస్యలు పరిష్కరించకుంటే నవంబర్ 1నుంచి నిరవధిక సమ్మెకు వెళ్ళటానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీ జీఈఎ)సిద్దంగా ఉందని ఏపీ జీఈఎ గుంటూరు జిల్లా అధ్యక్షులు సయ్యద్ చాంద్‌బాషా ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ మేరకు మంగళవారం తాడికొండ తాలూకా యూనిట్ తహశీల్దార్ కార్యాలయం వద్ద ఏపీ జీఈఎ సభ్యులు రిలే నిరాహార దీక్షలు చేశారు. ఈ సందర్భంగా చాంద్‌బాషా మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం స్పందించకపోవడం వలనే ఉద్యోగులు పోరుబాట పట్టారని పేర్కొన్నారు. సీపీఎస్‌ను రద్దు చేయాలని, కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్దీకరించాలని, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. 1993, నవంబర్ 25 ముందు విధుల్లో చేరిన ఎన్ఎంఆర్‌లను రెగ్యులర్ చేయాలన్నారు. 2023, జులై 1వ తేదీ నుంచి 12వ సవరణ పీఆర్సీ అమలు చేయాలని, 11వ పీఆర్సీలో ఉన్న పెండింగ్ డీఏలను తక్షణమే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీ జీఈఎ జిల్లా కార్యదర్శి కెవిఎస్ శివారెడ్డి, నగర శాఖ అధ్యక్షులు వై.నాగేశ్వరరావు, నగరశాఖ ఉపాధ్యక్షులు దక్షిణామూర్తి, రత్తయ్య, తాలూకా యూనిట్ అధ్యక్షులు సుబ్బారావు, కార్యదర్శి సుమిత్రాదేవి, వెంకటేశ్వర్లు, రమణ పాల్గొన్నారు.

'వ్యవసాయ మార్కెట్ పెన్షన్స్ హోమ్' ప్రారంభం

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : గుంటూరు వ్యవసాయ మార్కెట్ నందు 'వ్యవసాయ మార్కెట్ పెన్షన్స్ హోమ్'ను మిర్చి యార్డ్ చైర్మన్ మాదిరెడ్డి సుధాకర్‌రెడ్డి మంగళవారం ముఖ్య అతిథిగా హాజరై ప్రారంబించారు. ఈ సందర్భంగా సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ దూర ప్రాంతాల నుంచి యార్డ్‌కు వచ్చే ఎంప్లాయిస్‌కు ఈ పెన్షన్స్ హోమ్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. వలంటీర్ వ్యవస్థ ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇంటి వద్దకు వచ్చి పెన్షన్ ఇవ్వటం ఒక్క వైసీపీకే చెల్లిందన్నారు. భవిష్యత్తులో ఏఎంసీ పెన్షనర్ అసోసియేషన్ వారికి ఎటువంటి సహాయ, సహకారాలు కావాలన్నా చేయడానికి ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి సారధ్యంలో తాము ఎప్పుడూ ముందుంటామని పేర్కొన్నారు. చివరిగా పెన్షన్ అసోసియేషన్ వారికి హెల్త్ కార్డులను అందజేశారు. కార్యక్రమంలో యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి, యార్డ్ ఇన్‌ఛార్జ్ కె.శివారెడ్డి, యార్డ్ పాలకవర్గం, ఏపీ పెన్షనర్ అసోసియేషన్ అధ్యక్షులు పీడీ రొమ్మిరెడ్డి, జనరల్ సెక్రెటరీ డి.రత్నబాబు, గౌరవ అధ్యక్షులు జేటీసీ యూము రెడ్డి, రెగ్యులర్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షులు ఎ.భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

విశాలాంధ్ర-దుగ్గిరాల : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు సయ్యద్ చాంద్ భాషా మౌఖిక ఆదేశాల ప్రకారము ఉద్యోగుల సమస్యలపై రానున్న రోజులలో చేపడుతున్న ఉద్యమాలలో ఉద్యోగులు అందరూ ఐక్యంగా కలిసి రావాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం దుగ్గిరాల యూనిట్ అధ్యక్షులు అందె బాల చంద్రమౌళి కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉద్యోగుల డిమాండ్లతో కూడిన గోడ పత్రికలను దుగ్గిరాల మండల అభివృద్ధి అధికారిణి కుసుమ శ్రీదేవి ద్వారా ఆవిష్కరించారు. సీపీఎస్‌ను రద్దు చేయాలని, ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని ప్రతినెల ఒకటవ తేదీన జీతాలు చెల్లించేలా చట్టం చేయాలని, డీఎస్సీ ద్వారా నియమితులైన కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు మెరుగైన జీతాలు ఇవ్వాలని తదితర ఉద్యోగులు పెన్షనర్ల డిమాండ్ల సాధనకు రానున్న రోజులలో పెద్దఎత్తున ఉద్యమించనున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో దుగ్గిరాల యూనిట్ ఏపీజీఈఏ ఉపాధ్యక్షులు దమ్ము ఆశీర్వాదమ్మ, హెల్త్ అసిస్టెంట్ సంగెపు శ్రీనివాసరావు, డీఎస్ఎస్ ఆంజనేయ శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

ప్రమోషన్‌లు ప్రత్యక్ష పద్దతిలోనే ఇవ్వాలి

విశాలాంధ్ర-గుంటూరు : జిల్లాలోని ఉపాధ్యాయులకు ప్రమోషన్ విల్లింగ్‌ను/నాట్ విల్లింగ్‌ను ప్రత్యక్ష పద్దతిలో ముఖాముఖీగా జరగాలని, అలాకాకుండా ఆన్‌లైన్ ద్వారా తీసుకొనుటం సరికాదని ఏపీటీఎఫ్(1938) జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సుబ్బారావు అధికారులను ఒక ప్రకటనలో కోరారు. డీఈఓ వెబ్‌సైట్‌లో చూసుకొని, ఆన్‌లైన్ ద్వారానే నాన్ విల్లింగ్ ఇవ్వటం వలన ఉపాధ్యాయులు ఒత్తిడికి గురి అవుతున్నారని ఆయన అన్నారు. తాత్కాలిక ప్రమోషన్ పేరుతో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులను కొన్ని నెలలు పనిచేయుంచుకొని వారికి ఒక్కొక్కరికి రూ.10 వేలు వరకు చెల్లించాలని, అవి చెల్లించకుండ తిరిగి వారికే ప్రమోషన్‌లు పేరుతో ఉపాధ్యాయులను సందిగ్దంలో ఉంచుతున్నారనీ, ఆ ఉపాధ్యాయులకు ఎనిమిది సంవత్సరాలు ఆ పాఠశాలలో సర్వీసు పూర్తి అయినచో, ఆయన బదిలీ కావాలా, ప్రమోషన్‌కు పోవాలనే సందిగ్దంలో ఉన్నారనీ సుబ్బారావు అన్నారు. కావున రాష్ట్ర ప్రభుత్వం ప్రమోషన్‌లను ప్రత్యక్ష పద్దతిలోనే జరపాలని డిమాండ్ చేశారు.

విశాలాంధ్ర పల్నాడు జిల్లా

అంగన్‌వాడీ కేంద్రంలో సైకిళ్ళు పంపిణీ

విశాలాంధ్ర-కారంపూడి: అంగన్ వాడీ కేంద్రంలో వయస్సు తగ్గ ఎత్తు లేని పిల్లల కోసం సైకిళ్లను అందించి నట్లు మంగళవారం తహశీల్దార్ జి.శ్రీనివాస్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ ఆదేశాల మేరకు సుస్థిరాభివృద్ధి లక్ష్యాలలో భాగంగా సైకిళ్లను వితరణగా అందించడం జరిగిందన్నారు. ప్రతి రోజు క్రమం తప్పకుండా చిన్నారులతో సైకిలింగ్, వ్యాయామం చేయించాల న్నారు. ప్రతి నెల చిన్నారులలో వచ్చే మార్పులను రిపోర్టు అందించాలన్నారు. కేంద్రంలో బాలామృతం, కోడిగుడ్లు, పాలు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. గురజాల సిడిపిఓ షేక్ రుక్సానాసుల్తానాబేగం, సూపర్‌వైజర్ అనంతలక్ష్మీ, అంగన్‌వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజానగర్‌లో ఫ్యామిలీ డాక్టర్ వైద్య సేవలు

విశాలాంధ్ర-దుర్గి : మండల పరిధిలోని రాజానగర్ గ్రామంలో మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ వైద్య సేవలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యాలయం వద్ద వైద్య సిబ్బంది రోగులకు నిర్వహిస్తున్న వైద్య పరీక్షల తీరును ఎంపీడీఓ పి.శివప్రసాద్ పరిశీలించారు. రోగులకు బీపీ, షుగర్ పరీక్షలు జరిపి అవసర మేరకు ఉచితంగా మందులు అందజేశారు. ఆయన వెంట సీనియర్ అసిస్టెంట్ రాజు, సెక్రటరీ వై.వెంకటేష్ ఉన్నారు.

గంగాదేవి కుంటను పరిశీలించిన ఎంపీడీఓ

విశాలాంధ్ర-దుర్గి : మండల పరిధిలోని ఓబులేశునిపల్లె గ్రామంలోని గంగాదేవి కుంటను మంగళవారం ఎంపీడీఓ పి.శివప్రసాద్ పరిశీలించారు. ఉపాధి హామీ పథకం క్రింద ఈ కుంటలో పూడికతీత పనులు పూర్తి చేశారు. ఈ కుంటను అమృత సరోవర్ పథకం కింద కుంట వద్ద బోర్డు, జెండా దిమ్మె ఏర్పాటు చేయాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రావడంతో ఈ పరిశీలన సంతరించుకుంది. సర్పంచ్ ఉన్నం రమణపెద్దబాయి, ఏపీఓ చిన వెంకటేశ్వర్లు, సీనియర్ అసిస్టెంట్ రాజు, సెక్రటరీ వై.వెంకటేష్, ఉపాధి సిబ్బంది ఉన్నారు.

ఉప్పుతోళ్ల కృష్ణ మరణం బాధాకరం

విశాలాంధ్ర-మాచర్ల : పట్టణంలోని టీడీపీ నాయకులు ఉప్పుతోళ్ల కృష్ణ అకాల మరణం పార్టీకి తీరనిలోటు అని టీడీపీ పట్టణ అధ్యక్షుడు కొమెరా దుర్గారావు అన్నారు. మంగళవారం కృష్ణ మృతదేహాన్ని సందర్శించి పూలమాలతో నివాళులర్పించారు. అనంతరం దుర్గారావు మాట్లాడుతూ ఉప్పుతోళ్ల కృష్ణ నిబద్ధత కలిగిన వ్యక్తి అని, తోటి వారి పట్ల స్నేహభావంతో ఉండేవాడన్నారు. అలాంటి మంచి వ్యక్తి నేడు మన మధ్య లేకపోవడం బాధాకరమన్నారు. ఆయన కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో మున్నా రాంబాబు, మంజుల వెంకటేశ్వర్లు, వజ్రం నాయక్, కొమెర శివ, మంజుల అంజి, బత్తుల కోటి, మాచర్ల బాబు, కామన్ బోయిన కాశి లింగం, బత్తుల భవాని శంకర్, కొమెర శ్రీను, చల్లా వెంకటేశ్వర్లు, దానం బాబు, దేరంగుల దాసరయ్య, షేక్ జానీ, అంజి, దేరంగుల పెద్ద దాసరయ్య, కొమెర సాంబ, వెంకీ తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాలకు తరలిరండి

విశాలాంధ్ర-పెదకూరపాడు : ఈ నెల 27, 28 తేదీలలో రాజమండ్రిలో జరిగే ప్రముఖ సినీనటులు, యుగపురుషులు, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి దివంగనేత నందమూరి తారక రామారావు శత జయంతి ఉత్సవాలకు నియోజకవర్గంలోని తెలుగుదేశం పార్టీ అభిమానులు, నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని జిల్లా కార్యవర్గ సభ్యులు అత్తిమల రమేష్ మంగళవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాలు జరుపుకోవడం శుభపరిణామమని అన్నారు.

సచివాలయాన్ని ఎంపీడీఓ తనిఖీ

విశాలాంధ్ర-దుర్గి : మండల పరిధిలోని ఓబులేశునిపల్లె గ్రామ సచివాలయాన్ని మంగళవారం ఎంపీడీఓ. పి.శివప్రసాద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పలు రికార్డులను పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. రికార్డులు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు పూర్తి చేసి ఉండాలని సూచించారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలను వెంటనే పరిశీలించి సకాలంలో సర్టిఫికెట్స్ అందజేయాలని ఆదేశించారు. ఆయన వెంట సీనియర్ అసిస్టెంట్ రాజు, సెక్రటరీ. వై.వెంకటేష్ ఉన్నారు.

చలివేంద్రం ప్రారంభం

విశాలాంధ్ర-అమరావతి : మండలంలోని లింగాపురం గ్రామ శివారులోగల టవర్ వద్ద మంగళవారం పల్నాడు జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు గంటా గోపి ఆధ్వర్యంలో ఉచిత మంచినీటి చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గోపి మాట్లాడుతూ దేశానికి పట్టిన పీడను తొలగించి ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రజలను ఆదుకునే విధంగా రాజీవ్ గాంధీని స్ఫూర్తిగా తీసుకుని నేటి యువత సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని గోపి పిలుపునిచ్చారు. సుమారు రెండు నెలల పాటు ఈ చలివేంద్రం ఉంటుందని తెలియజేసారు. కార్యక్రమంలో ముప్పేర ఉదయ శంకర్, ఏకుల సురేష్, బి.శివ, రెబ్బవరపు జాను పాల్గొన్నారు.

పాము కాటుకు గురై వ్యక్తి మృతి

విశాలాంధ్ర-రొంపిచర్ల : పాము కాటుకు గురై వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని విప్పర్లపల్లి గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. దీనికి సంబంధించి వివరములు ఇలా ఉన్నాయి. ఆ గ్రామానికి చెందిన ఎందేటి సత్యనారాయణ (37)కొద్ది రోజుల క్రితం పొలంలో కూలీ పనులు చేస్తుండగా కుడి కాలు మీద పాము కాటు వేయటం వలన అపస్మారక స్థితికి చేరుకున్నారు. వెంటనే పొలంలో ఉన్న తోటి కూలీలు అతనిని చికిత్స నిమిత్తం హాస్పిటల్‌లో చేర్చారు. హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందారు. కాగా మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఈ సంఘటనతో గ్రామంలో విషాదఛాయలు నెలకొన్నాయి.

టిడ్కో గృహ లబ్ధిదారుల సమస్యలు పరిష్కరించాలి: సీపీఐ

విశాలాంధ్ర-చిలకలూరిపేట : టిడ్కో గృహలబ్ధిదారుల సమస్యలను పరిష్కరించాలని సీపీఐ ఏరియా కార్యదర్శి నాగభైరు రామసుబ్బాయమ్మ కోరారు. మంగళవారం లబ్ధిదారులతో కలసి మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, మున్సిపల్ కమిషనర్ సీహెచ్ గోవిందరావులను కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణంలోని తాగునీటి చెరువులకు వెళ్లే మార్గంలో 52 ఎకరాల ప్రాంగణంలో నిర్మించిన టిడ్కో గృహాల్లో చేరిన లబ్ధిదారులు పలు సమస్యలు ఎదుర్కొంటున్నారని, అందువల్ల ఆ ప్రాంతంలో నివసించటానికి ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. టిడ్కో గృహ సముదాయంలో వీధి దీపాలు ఏర్పాటు చేయాలని, గృహ సముదాయాల మధ్య ఉన్న ఖాళీస్థలాలలో చెట్లు పెరిగిపోయాయని, వాటిని తొలగించి శుభ్రం చేయాలని కోరారు. తాగునీటిని ఉదయం సాయంత్రం విడదల చేయాలని, నీటి ఫిల్టర్ చేసి ఇవ్వాలని డిమాండ్ చేశారు. గృహ సముదాయాల మధ్య వెలసిన పిచ్చిచెట్లతో పాములు, విష కీటకాలు వస్తున్నాయని, తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. పార్కులు, కమ్యునిటీ హాలును వాడుకొనే విధంగా తీర్చిదిద్దాలని సూచించారు. చిలకలూరిపేట ఆర్టీసీ డిపో నుంచి ఉదయం, సాయంత్రం రెండు ట్రిప్పులు రవాణా ఏర్పాటు చేయాలని కోరారు. టిడ్కో గృహాలకు వెళ్లే మార్గంలో మందుబాబుల ఆగడాలు పెరిగి పోయాయని, రాత్రి సమయాల్లో రక్షణ కల్పించే విధంగా పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరారు.

చర్యలు తీసుకుంటాం...

ఇందుకు మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, కమిషనర్ సీహెచ్ గోవిందరావు సమాధానమిస్తూ ఇప్పటికే వీధి లేట్ల ఏర్పాటు కోసం రూ.25 లక్షలతో ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. త్వరలోనే వీటిని ఏర్పాటు చేస్తామన్నారు. తాగునీటి సరఫరా కోసం మరొక మోటారు ఏర్పాటు చేస్తున్నట్లు, నీటిని క్లోరినేషన్ చేసి విడదల చేస్తున్నామని తెలిపారు. టిడ్కో గృహ సముదాయంలో లబ్ధిదారుల సౌకర్యార్థం ఆర్టీసీ బస్సులు ఏర్పాటు విషయంలో జిల్లా కలెక్టర్ ప్రయత్నిస్తున్నారని వెల్లడించారు. వీటి కంటే ముందుగా ఆటో సౌకర్యం ఏర్పాటు చేసి, ఒకే రకమైన చార్జీలు వసూలు చేసేవిధంగా కృషి చేస్తున్నామని తెలిపారు. జంగిల్ క్లీనింగ్ చేయిస్తామని, పాములు రాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. పాఠశాల ఏర్పాటుకు కృషి చేస్తున్నామని వెల్లడించారు. త్వరలోనే రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని ఆధ్వర్యంలో అన్ని శాఖల అధికారులతో సమీక్షా సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సీపీఐ పట్టణ కార్యదర్శి పేలూరి రామారావు, నాయకులు నాయుడు శివకుమర్, బొంతా భగత్ సింగ్, ఆరాధ్యాల రామకృష్ణ, ఏపీ మహిళా సమాఖ్య పట్టణ కార్యదర్శి బి.లలితకుమారి, లబ్ధిదారులు అబుబకర్, కోటేశ్వరరావు, బి.ఝాన్సీ వాణి పాల్గొన్నారు.

సచివాలయం ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

కాసా రాంబాబు

విశాలాంధ్ర-నరసరావుపేట : ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికి మానస పుత్రికగా చెప్పుకునే గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న శానిటేషన్ అండ్ ఎన్విరాన్మెంట్ సెక్రటరీలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాసా రాంబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మున్సిపాల్ కమిషనర్ నుంచి శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ల వరకు గ్రామ, వార్డు సచివాలయం ఉద్యోగులపై జరుగుతున్న వేధింపులు ఆపకపోతే తీవ్రమైన పరిణామాలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వం యిచ్చిన జీఓను అమలు చేయకుండా ఉద్యోగుల ప్రాథమిక హక్కులను కాలరాస్తున్నారని మండిపడ్డారు. రోజుకు 10 నుంచి 14 గంటలు పనిచేయిస్తూ కార్మిక చట్టాలను ఉల్లంఘిస్తూ వారితో చాకిరి చేయించుకుంటున్నారని అన్నారు. మహిళలు, గర్భిణులు అని కూడా చూడకుండా సమయపాలన అమలు చేయకుండా సస్పెండ్‌ల పేరుతో హింసిస్తున్నారని, అధికారులపై వెంటనే శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. చెత్త సేకరణ పన్నుపై ప్రజలు వ్యతిరేకంగా ఉన్న తరుణంలో ప్రజలు పన్ను కట్టకపోతే సెక్రటరీలను మీ జీతంలో నుంచి కట్టాలని వేధించడం ఎంత వరకు సమంజసం అని ప్రశ్నించారు. వీళ్లకు సంబంధం లేని పారిశుద్య పనులను వీరికి అన్వయించి పారిశుధ్య పనులకు మీరే బాధ్యులు అని సెక్రటరీలను కేవలం మేస్త్రీలుగా పనులు చేయించడం తగదన్నారు. జాబ్ చార్ట్‌ను అమలు చేయకుండా మేధిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని అన్నారు. టెక్నికల్ సర్వీసెస్ అయిన జనన, మరణ ధ్రువీకరణ పత్రాల జారీ, నో ఆబ్జెక్షన్ సర్టిఫికెట్, మ్యారేజ్ సర్టిఫికెట్, ఎన్విరాన్మెంట్ విధులు అయినా ప్లాస్టిక్ నియంత్రణ, ఫుడ్ సేఫ్టీ చెకింగ్ విధులు వీరికి వెంటనే ఇచ్చి వారి ఆత్మ గౌరవంను కాపాడాలని కోరారు. సీడీఎంఏ ఇచ్చిన సెలవుల ఉత్తర్వులు అన్ని మున్సిపాలిటీలలో తూచా తప్పకుండా అమలు చేయాలని డిమాండ్ చేశారు. చెత్త పన్ను నుంచి విముక్తి కలిగించాలని కోరారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్‌లను రిపోర్టింగ్ ఆఫీసర్లుగా తొలగించి ఆ బాధ్యతలు ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ లేదా కమిషనర్‌లను రిపోర్టింగ్ ఆఫీసర్‌గా పెట్టాలని సూచించారు. ఈ సమస్యలు పరిష్కారం చేయకపోతే ఆంధ్రప్రదేశ్ శానిటరీ ఎన్విరాన్మెం టల్ సెక్రటరీస్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు గుజ్జుల ఈశ్వరయ్య నేతృత్వంలో సచివాలయ ఉద్యోగు లందరినీ ఐక్యం చేసి భవిష్యత్తు ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామని ఏఐటీయూసీ అధ్యక్ష, కార్యదర్శులు ఉప్పలపాటి రంగయ్య, వైదన వెంకట్ హెచ్చరించారు.

ప్రభుత్వాలకు ఇవే చివరి ఎన్నికలు: సీపీఐ

విశాలాంధ్ర-రెంటచింతల : మంచికల్లు గ్రామంలో నూతనంగా నిర్మించిన సీపీఐ పార్టీ స్థూపాన్ని పల్నాడు జిల్లా సహాయ కార్యదర్శి షేక్ హుస్సేన్ జెండా ఆవిష్కరించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి ప్రజా సంక్షేమం కరువైందన్నారు. మోసపూరిత వాగ్దానాలతో అధికారం చేపట్టిన ప్రధాని మోడీ, సీఎం జగన్మోహన్ రెడ్డి రాష్ట్ర సంక్షేమాన్ని గాలికొదిలి కార్పొరేట్ శక్తులకు కొమ్ము కాయడం దుర్మార్గమన్నారు. గ్యాస్, డీజిల్, పెట్రోల్ ధరలు విపరీతంగా పెరిగి నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్నంటడంతో పేదలకు జీవనం కష్టతరంగా మారిందని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఇవే చివరి ఎన్నికలు అని జోస్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి కేతావత్ రంగ నాయకులు, ఏలూరి నాగార్జున, చేవూరి శ్రీనివాసరావు, తుమ్మా సంజీవరావు, కొమరగిరి సురేష్, పొట్లూరి అంకమ్మరావు తదితరులు పాల్గొన్నారు.

గడియారస్థంబం బాగుచేయాలి

విశాలాంధ్ర-చిలకలూరిపేట : పట్టణానికే తలమానికంగా ఉన్న గడియారస్థంబంను మరమ్మతులు చేసి సుందరీకరణ చేయాలని సీపీఐ నాయకులు, ఏఐటీయూసీ అనుబంధ వీధి విక్రయదారుల సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాయుడు శివకుమార్ కోరారు. ఈ మేరకు ఆయన మంగళవారం మున్సిపల్ కమిషనర్ సీహెచ్ గోవిందరావు, చైర్మన్ షేక్ రఫానీలకు వినతిపత్రం అందజేశారు. గతంలో రూ.10 లక్షలతో మరమత్తులు చేసి ప్రారంభించిన గడియార స్థంబం కొన్ని రోజులకే శిథిలావస్తతకు చేరుకుందని గడియారాలు మరమత్తులు గురికావడంతో పాటు ఆక్రమణకు గురి అవుతుందని ఫిర్యాదు చేశారు. గడియార స్థంబం మరమత్తులు చేసి, వాటర్ ఫౌంటెన్, గడియారాలు, గార్డన్ ఏర్పాటు చేయాలని కోరారు. ఇందుకు చైర్మన్, కమిషనర్ సానుకూలంగా స్పందించి త్వరలోనే గడియార స్థంబం బాగు చేయిస్తామని హామీ ఇచ్చారు.

సివిల్స్‌లో 208వ ర్యాంక్ సాధించిన విష్ణు

విశాలాంధ్ర-రెంటచింతల : జాతీయ స్థాయిలో యూపీఎస్సీ నిర్వహించిన సివిల్స్ మెయిన్ పరీక్షలో రెంటచింతలకు చెందిన పాలువాయి విష్ణువర్ధన్ రెడ్డి సత్తా చాటాడు. 292 ర్యాంకు సాధించాడు. 2020లో రాసిన ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ పరీక్షలో జాతీయ స్థాయిలో మూడో ర్యాంకు సాధించాడు. విష్ణు తండ్రి నరసింహా రెడ్డి విజయవాడలో ఓ కార్పొరేట్ కళాశాలకు డైరక్టరుగా వ్యవహరిస్తున్నారు. తల్లి పద్మావతి బెల్లకొండ మండలం గణపవరం జడ్పీ హై స్కూలులో ఆంగ్ల ఉపాధ్యాయినిగా పని చేస్తుంది. స్వగ్రామం వెల్దుర్తి మండలం శిరిగి రిపాడు. వ్యవసాయ కుటుంబంలో జన్మించిన విష్ణు 2017, 2018, 2019, 2020 పోటీ పరీక్షలకు హాజరయ్యేవాడు. ఆశించిన ర్యాంకు రాకపోయినా పట్టువదలని విక్రమార్కుడిలా ప్రయత్నించాడు. 5వ విడత లక్ష్యానికి చేరువైయ్యాడు. ఐపీఎస్‌లో శిక్షణ పొంది సమాజ సేవా చేయాలనే లక్ష్యంతో ఉన్నట్లు వెల్లడించాడు.

టీబీ రోగులకు పౌష్టికాహారం పంపిణీ

విశాలాంధ్ర-పెదకూరపాడు : మండల పరిధిలోని 75 తాళ్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం టీబి రోగులకు ఉచితంగా పోషకలతో కూడిన కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య నిపుణులు డాక్టర్ ప్రియాంక మాట్లాడుతూ టీబీ రోగులకు సంబంధించి పోష్టికాహారాన్ని అందించాలన్న ఉద్దేశంతో నిక్షేయ మిత్ర అనే పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టడం జరిగిందన్నారు. ఒక్కొక్క కిట్టు రూ.7వందలు విలువ చేస్తుందని, ఈ అవకాశాన్ని టీబీ పేషెంట్లు వినియోగించుకోవాలన్నారు. వీరికి ఉచిత పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేస్తామని డాక్టర్ ప్రియాంక అన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు దిలీప్ కుమార్, విజయ్ కుమార్, అహ్మద్, స్టాఫ్ నర్స్ దుర్గ, ఆశా కార్యకర్తలు ఎం. శివలీల, ఏఎన్ఎం గ్రేసమ్మ పాల్గొన్నారు.

విద్యుత్ కోతలు ఆపాలి

విశాలాంధ్ర-రాజుపాలెం : పెరిగిన విద్యుత్ ధరలతో పేద ప్రజలు ఇబ్బంది పడుతున్న తరుణంలో అప్రకటిత విద్యుత్ కోతలతో గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మే నెల ఎండ తీవ్రత ఎక్కువ ఉన్న ఈ రోజుల్లో ప్రభుత్వం విద్యుత్ కోతులు విధించి తీవ్ర ఇబ్బందులు పాలు చేస్తోంది. ఈ సందర్భంగా రాజుపాలెం తెలుగుదేశం మండల పార్టీ ఆధ్వర్యంలో రాజుపాలెం విద్యుత్ ఏఈ కార్యాలయం ఎదుట నిరసన ధర్నా కార్యక్రమం నిర్వహించారు. పెరిగిన విద్యుత్ ధరలు తగ్గించాలి.. కరెంటు కోతలను ఎత్తివేయాలని అంటూ ధర్నా నిర్వహించారు. స్థానిక విద్యుత్ ఏఈ కార్యాలయం వద్దకు వెళ్లినప్పుడు కార్యాలయం తలుపులు 11 గంటల 30 నిమిషాల వరకు తీయకపోవడంతో అధికారులు ఎవరూ లేకపోవడంతో రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి మెమోరాండం ఇచ్చారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు పల్లపాటి పెద్దిరాజు, పల్నాడు జిల్లా తెలుగు యువత అధికార ప్రతినిధి షేక్ అల్లభక్షు, మాజీ ఎంపీపీ గుత్తా వెంకట్రావు, ధూళిపాళ్ల ఆంధ్రా బ్యాంక్ మాజీ చైర్మన్ పాడి పేద వెంకటేశ్వర్లు, నల్లమోతుల శ్రీనివాసరావు, మొరసా శ్రీనివాసరావు, జంగం రాజా, క్లస్టర్ ఇన్‌ఛార్జ్ లంక వీరయ్య, వాస వెంకటేశ్వర్లు, పగడల శ్రీనివాసరావు, గంగవరపు రామ లక్ష్మణడు, తమాటం వీరయ్య, తోట శివ,గణేశ వెంకట్రావు, నర్రా ఆంజనేయులు, మొర్రిబోయిన వెంకటాప్పయ్య, దుడ్డు అప్పారావు, నాయకులు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గున్నారు.

మాలమహానాడు పట్టణ కమిటీ ఎన్నిక

విశాలాంధ్ర-వినుకొండ: మాలమహానాడు పట్టణ కమిటీని నియోజకవర్గ ఇన్చార్జి కీర్తిపాటి వెంకటేశ్వర్లు ఎన్నిక చేశారు. నియోజకవర్గ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ పట్టణంలో మాలల సమస్యల పట్ల నిరంతరం పోరాటం చేయడానికి ఈ కమిటీలు దోహద పడతాయని పట్టణంలోని ప్రతి వార్డులో విద్యార్థులు మహిళలు ఉద్యోగుల అంతా ఏకమై భవిష్యత్ కార్యాచరణకు సిద్ధం కావాలని ఏ రాజకీయ పార్టీ అయినా మాలలను విస్మరించకుండా ఉండాలని అలా వ్యవహరించిన రాజకీయ పార్టీలకు బాబా సాహెబ్ ఆలోచన విధానంతో నూతనంగా ఎన్నుకున్న కమిటీలు పనిచేస్తాయని తెలియజేశారు వినుకొండ పట్టణ ఉపాధ్యక్షులుగా జ్యోతి మల్లికార్జునరావు, సెక్రటరీగా జంగా నాసరయ్య, జనరల్ సెక్రెటరీగా బేతం బాలకృష్ణ, ట్రెజరర్‌గా గుర్రాల సుబ్బారావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పార్లమెంట్ అధ్యక్షులు కోండ్రు విజయ్, నియోజక వర్కింగ్ అధ్యక్షులు గుడిపూడి ఏసురత్నం, అధ్యక్షులు కొమ్మతోటి కృపయ్య, దార్ల ఎర్రయ్య, పట్టణ అధ్యక్షులు బేతం దేవానంద్ యూత్ అధ్యక్షులు కీర్తిపాటి రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఉదారతను చాటుకున్న సీఎం

విశాలాంధ్ర-గుంటూరు : గుంటూరు నగరానికి మంగళవారం విచ్చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మరోసారి తన ఉదారతను చాటుకున్నారు. అనారోగ్య, ఆర్థిక సమస్యలతో సహాయం కోసం వచ్చిన ప్రజలను ప్రత్యేకంగా హెలిప్యాడ్ ప్రాంగణానికి పిలిపించుకొని వారి సమస్యలను తెలుసుకున్నారు. వారి భుజం తట్టి ఓదారుస్తూ నేనున్నానని కొండత భరోసా ఇచ్చారు. బాధితులకు 24 గంటల్లోనే సహాయం అందించాలని జిల్లా కలెక్టర్‌ను ముఖ్యమంత్రి ఆదేశించారు.

కొనసాగుతున్న శిక్షణా తరగతులు

విశాలాంధ్ర-వినుకొండ: వినుకొండ శాఖ గ్రంథాలయ అధికారి భూక్యా బద్రి నాయక్ ఆధ్వర్యంలో వినుకొండ శాఖ గ్రంథాలయం నందు వేసవి శిక్షణ శిబిరాల్లో భాగంగా విద్యార్థిని విద్యార్థులకు హ్యాండ్ రైటింగ్ క్లాస్ ప్రభాకర్ బోధించడం జరిగింది. అలాగే నిఖిల్ జనరల్ నాలెడ్జ్ క్లాస్ బోధించడం జరిగింది అలాగే ఈ.వి రమణ రెడ్డి తెలుగు క్లాస్ బోధించడం జరిగింది. ప్రసిద్ధిగాంచిన మన వెనుకొండ గురించి బోధించడం జరిగింది. ఈ వేసవి శిక్షణ కార్యక్రమానికి మొత్తం 25 మంది విద్యార్థులు హాజరయ్యారు.

మండలంలో కలెక్టర్' సుడిగాలి పర్యటన

విశాలాంధ్ర-రాజుపాలెం : పల్నాడు జిల్లా, రాజుపాలెం మండల పరిధిలోని ఆర్అండ్ఆర్ కాలనీ ప్రాథమిక వైద్య ఆరోగ్యశాఖ ఉప కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ శివశంకర్ ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ అమలు జరుగుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ఫ్యామిలీ డాక్టర్ విధానం అమలులో భాగంగా ముందురోజు ప్రజలకు వాలంటీర్ల ద్వారా సమాచారం పంపాల్సి ఉండగా, సచివాలయ వెల్ఫేర్ సెక్రటరీ, ఏఎన్ఎం, మహిళా పోలీస్‌లు కలిసి సమావేశం నిర్వహించి ప్రణాళిక బద్ధంగా ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకోకపోవడంతో జిల్లా కలెక్టర్ వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆదేశాలను పాటించకుండా విధుల్లో నిర్లక్ష్యం వహించడంపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఫ్యామిలీ డాక్టర్ విధానం సక్రమంగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని తహశీల్దార్, ఎంపీడీఓ, మండల వైద్యాధికారులకు ఆదేశించారు. అక్కడ నుంచి బయటకు వస్తున్న జిల్లా కలెక్టర్‌ను ఆర్అండ్ఆర్ కాలనీవాసులు తాము తాగునీటికి ఇబ్బంది పడుతున్నామని, ఆర్వో ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలని విన్నవించగా, మంజూరు చేయిస్తామని జిల్లా కలెక్టర్ భరోసా ఇచ్చారు. తహశీల్దార్ నలిని, పీహెచ్‌సీ సబ్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ రవితేజ, మండల పరిషత్ అభివృద్ధి అధికారి పాల్గొన్నారు.

కరెంటు కోతలపై టీడీపీ నిరసన

విశాలాంధ్ర-వినుకొండ: రాష్ట్రంలో విపరీతంగా పెరిగిన కరెంటు కోతలు, విద్యుత్ ఛార్జీల పెంపును నిరసిస్తూ రాష్ట్రవ్యాప్త నిరసన కార్యక్రమాలలో భాగంగా మంగళవారం పట్టణ టిడిపి అధ్యక్షుడు పఠాన్ ఆయుబ్ ఖాన్ అధ్యక్షతన కారంపూడి రోడ్డులోగల విద్యుత్ సబ్ స్టేషన్ దగ్గర నిరసన చేపట్టారు. కార్యక్రమంలో వినుకొండ పట్టణ మండలం, బొల్లాపల్లి, ఈపూరు మండలాల పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు పల్లమీసాల దాసయ్య, సౌదాగర్ జానీ భాష, పెమ్మసాని నాగేశ్వరరావు,పత్తి పూర్ణచంద్రరావు,పి.వి.సురేష్ బాబు మాట్లాడుతూ ట్రూ అప్ చార్జీలు, సర్ చార్జీలు, ఫిక్స్ చార్జీల పేరుతో పేద ప్రజలపై భారం వేస్తున్నారని విమర్శించారు. గత చంద్రబాబు హయాంలో ఒక్కసారి కూడా పెరగలేదన్నారు. కోతలు లేని కరెంట్ ఇవ్వాలి, పెంచిన విద్యుత్ ఛార్జీలను వెంటనే తగ్గించాలి, అవినీతి కోసం పెడుతున్న మోటార్లకి మీటర్లను వెంటనే ఉపసంహరించుకోవాలి అని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గన్నమనేని వెంకయ్య, వినుకొండ మండల పార్టీ అధ్యక్షులు మాదినేని ఆంజనేయులు, ఉమ్మడివరం సర్పంచ్ వీర గంధం ఆనంద్, కర్నాటి వెంకట రెడ్డి, వజ్రాల క్రిష్ణ రెడ్డి, మాదాల చిరంజీవి, మాక్కేన రమేష్, కానాల వెంకటేశ్వర రెడ్డి, మాదాల క్రిష్ణ మద్దుకూరి రామ బ్రహ్మం, పువ్వాడ కృష్ణ, యూత్ జానీ, తుమాటి కాశి, దస్తగిరి, దూల నాగార్జున, లింగా రామయ్య, భత్తుల బాలరాజు, ఫరూక్, మురికిపూడి నాసరయ్య ఆది రాములు, ఖలీల్, కరిముల్లా, అక్బర్ బాషా, ఆచారి, చిన్నంశెట్టి సాంబశివరావు పాల్గొన్నారు.

విశాలాంధ్ర-బొల్లాపల్లి : రాష్ట్రంలో విచ్చలవిడిగా పెరిగిన విద్యుత్తు చార్జీలు, విద్యుత్ కోతలకు నిరసనగా ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీ పిలుపుమేరకు రాష్ట్రవ్యాప్త నిరసన కార్యక్రమంలో భాగంగా పల్నాడు జిల్లా బొల్లాపల్లి మండలంలోని మూగచింతల పాలెం గ్రామం సబ్ స్టేషన్ వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. బొల్లాపల్లి మండల తెలుగు దేశం పార్టీ కన్వీనర్ జరపల గోవింద నాయక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ జగన్‌మోహన్ రెడ్డి సారథ్యంలోని రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ ధరలను పెంచుతూ పేద ప్రజల నెత్తిన భారాలు మోపుతున్నాడని ఆందోళన వ్యక్తం చేశారు. రాముఖ్యమంత్రి ప్రజల సమస్యలు పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహించడం సరికాదన్నారు. ఇప్పటికైనా ప్రజల కష్టాలను గుర్తించి విద్యుత్ ఛార్జీలను తక్షణమే తగ్గించాలని టీడీపీ నాయకులు డిమాండ్ చేశారు. తెలుగు రైతు రాష్ట్ర అధికార ప్రతినిధి పి.నాగేశ్వరరావు, ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాసరి కోటేశ్వరరావు, నాయకులు టి.వెంకటేశ్వర్లు, ఏలిసెట్టి రంగయ్య, ఏ.శ్రీనివాసరావు, ఆర్.నారాయణ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విశాలాంధ్ర-చిలకలూరిపేట : నాడు చంద్రబాబు హయాంలో ఏనాడు ఒక్క నిమిషం కూడా కరెంటు కోతలు లేవని, కానీ ఈనాడు ఈ ఫేక్ ముఖ్యమంత్రి, ఆనాడు ఉన్న 16 శ్లాబులను 6 స్లాబ్ కింద కుదించి పేద ప్రజల నెత్తిన భారం వేశాడని రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి షేక్ కరిముల్లా అన్నారు. మంగళవారం కరెంటు కోతలు, పెంచిన విద్యుత్ చార్జీలకు నిరసనగా చిలకలూరిపేట పట్టణ విద్యుత్ సబ్ స్టేషన్ టీడీపీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం డీఈఈ అశోక్ కుమార్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ ఆనాడు 100 యూనిట్లు పైన ఉంటేనే ఛార్జీలు పెరిగేవి కానీ నేడు 30 యూనిట్లు దాటితే విద్యుత్ ఛార్జీలు పెంచి సామాన్యులపై కూడా బాదుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు, ముఖ్య నాయకులు, పార్టీ నాయకులు, వివిధ హోదాల్లో ఉన్న నాయకులు, టీడీపీ కౌన్సిలర్స్, గ్రామా/వార్డు అధ్యక్షులు/సెక్రెటరీలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర-అచ్చంపేట : రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఆదేశానుసారం విద్యుత్ కోతలు ఎత్తివేయాలని, విద్యుత్తు చార్జీల పెంపుదలను తగ్గించాలని నిరసిస్తూ పెదకూరపాడు నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ శాసనసభ్యులు డాక్టర్ కొమ్మాలపాటి శ్రీధర్ పిలుపు మేరకు అచ్చంపేట మండల తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీగా బయలుదేరి భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించి భారత రాజ్యాంగాన్ని కాపాడండి అంటూ నినాదాలు చేస్తూ, అచ్చంపేట విద్యుత్ సబ్ స్టేషన్ వద్దకు ర్యాలీగా వెళ్లి కరెంట్ ఆఫీస్‌ని ముట్టడించారు. కరెంటు కోతలు ఎత్తివేయాలి... కరెంటు చార్జీలను తగ్గించాలి... అని మండల పార్టీ అధ్యక్షులు నందిగం ఆశీర్వాదం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టౌన్ పార్టీ అధ్యక్షుడు షేక్ మాబు వలి, కూకట్పల్లి అయ్యప్పరాజు, తిరువాయి పాటి ఆంజనేయులు, రాయుడు సాంబశివుడు, వెనుగండ్ల కోటయ్య, పసుపులేటి పాపిరెడ్డి, రేపూడి థామస్, సందిపోగు స్వామియేలు, నెల్లూరి పెద వెంకటయ్య, నల్లమోతు హరిబాబు, చెమట శ్రీనివాసరావు, బోదెల సంబిరెడ్డి, ఎనుముల నాగరాజు, ఐపీఎస్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర-సత్తెనపల్లి : విద్యుత్ కోతలకు, విద్యుత్ చార్జీల పెంపుపై రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు లాంతర్లతో సత్తెనపల్లి సబ్ స్టేషన్ దగ్గర నిరసన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. నియోజకవర్గ నాయకులు మన్నెం శివ నాగమల్లేశ్వరరావు (మల్లి బాబు)టీడీపీ రాష్ట్ర కార్యదర్శి చౌట శ్రీనివాసరావు మల్లిబాబు మాట్లాడుతూ ఇప్పటికి 7 సార్లు విద్యుత్ చార్జీలు పెంచారని, స్మార్ట్ మీటర్ల వ్యవహారంలో రూ.7వేల కోట్ల స్కాం ఉందని, ఇప్పటికే రూ.57వేలు కోట్లు ప్రజలపై అదనపు భారం మోపారన్నారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి ఆళ్ల సాంబయ్య, సత్తెనపల్లి టౌన్ పార్టీ అధ్యక్షులు కటకం రామకృష్ణ, సత్తెనపల్లి రూరల్ టీడీపీ అధ్యక్షులు ఆళ్ల అమరేశ్వంరావు, పల్నాడు జిల్లా టీడీపీ కార్యదర్శి బత్తుల చంద్రశేఖర్, రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి వక్కంటి అజయ్ కుమార్, క్లస్టర్ ఇన్‌ఛార్జ్‌లు పొట్ల ఆంజనేయులు పాల్గొన్నారు.

దస్తావేజు పోయినది

జమ్మల రాజేశ్వరి, భర్త సత్యనారాయణ, ధరణికోట గ్రామం, అమరావతి మండలం, పల్నాడు జిల్లా అనే నా పేరు మీద అమరావతి సబ్ రిజిస్ట్రర్ కార్యాలయంలో రిజిష్టర్ కాబడిన ఒరిజినల్ సేల్ డీడ్ నెం. 510-1F/2A 0.50 సెంట్లు.. 1983 విస్తీర్ణం గల భూమి కలదు. అయితే దీనికి సంబంధించిన ఒరిజినల్ డాక్యుమెంట్ పోయినవి. జిరాక్స్ నిమిత్తం 20-05-2023 తీసుకోనిపోగా డాక్యుమెంట్లు పోయినవి. మార్గ మధ్యములో, డూప్లికేట్ డాక్యుమెంట్‌లను తీసుకోనే విధంగా వెళ్ళినప్పుడు పోగొట్టుకున్నాను. ఎంత వెతికినసూ దొరకలేదు. ఎవరికైనా దొరికినయెడల పై నెం.. 9618093226 తెలియచేయండి.

బహిరంగ ప్రకటన

నాక్షయింటు అయిన గుంటూరుజిల్లా, చిలకలూరిపేట(మం), కావూరిశివారు, లింగంగుంట్ల గ్రామ కాపురస్తురాలు పూనాటి అంజయ్యగారి భార్య విజయలక్ష్మీ గారి సూచనలమేరకు యావన్మందికీ తెలియజే యునది ఏమనగా, నాక్షయింటు దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిని ది.19-02-2015న విక్రయ దస్తావేజు నెం.1240/2015 యస్.ఆర్.ఓ. చిలకలూరిపేట ద్వారా విక్రయం పొంది సర్వహక్కులతో అనుభవించుచున్న ఆస్తిని తనఖాగా వుంచి ఋణంకొరకు ఆప్టస్ ఫైనాన్స్ ఇండియా ప్రైవేట్ లి.(AFIPL)నరసరావుపేట బ్రాంచ్ వారిని సంప్రదించి యున్నారు. అట్టి ఆస్తికి చెందిన ఒరిజినల్ లింకు విక్రయ దస్తావేజు 1851/2003 ది.31-07-2003న యస్.ఆర్.ఓ. చిలకలూరిపేటలో రిజిష్టరు కాబడిన దస్తావేజు పోయినదని, దొరికిన వారు తెచ్చి ఇవ్వగలరని, అట్టి ఆస్తిపై నాక్షయింటు లోనునిమిత్తం ఆప్టస్ ఫైనాన్స్ ఇండియా ప్రైవేట్ లి.(AFIPL) నరసరావుపేట బ్రాంచ్‌వారిని ఋణంకొరకు సంప్రదించి యున్నందున షెడ్యూలు ఆస్తిపైగాని పోయిన దస్తా వేజుపై గాని మరియు పొందు ఋణముపై గాని ఎవరికైనా ఏవిధమైన అభ్యంతరములు,క్లయిములు,సెక్యూరిటీలు,హక్కులు, వగైరాలు ఉన్నచో 7రోజుల లోపు వ్రాతపూర్వకంగా ఈక్రింది అడ్రస్‌కు తెలియజేయవలెనని, గడువులోపల ఎటువంటి క్లయిములు తెలియచేయనిచో నిక్షేపి ఆస్తిగా భావించబడును మరియు గడువు అనంతరము వచ్చుఆక్షే పణలు,వగైరాలు నాక్షయింటు హక్కులను బైండు చేయజాలవు.

షెడ్యూలు:గుంటూరు డి॥, నరసరావుపేట రి.డి॥, చిలకలూరిపేట సబ్.డి॥&(మం), కావూరి గ్రామ డి.నెం.607/బి, డోర్.నెం. 13-28నకు సమీపమునగల చ.గ.121లు ఖాళీ నివేశన స్థలమునకు హద్దులు. **తూర్పు:** కలవకూరి వెంకటేశ్వర్లు గారి స్థలముహద్దు, **దక్షిణం:** పూనాటి లక్ష్మయ్యగారి స్థలంహద్దు, **పడమర:** జాయింటు బజారు హద్దు, **ఉత్తరం:**బొల్లేపల్లి బంగారు బాబు గారి ఇల్లుహద్దు.

సాంబేలు ఆంజనేయ ప్రసాద్, అడ్వకేట్
AP LAW FIRM, డోర్.నెం.54-15-13, మధు టవర్స్, ఫ్లాట్ నెం.ఎఫ్.ఎఫ్.2, భారతీ నగర్, శ్రీనివాసనగర్ బ్యాంక్ కాలనీ, ఐ.సి.ఐ.సి.ఐ బ్యాంక్ ప్రక్కన, విజయవాడ-8. సెల్: 9949533987
విజయవాడ, తేది: 23-05-2023

మినీ మహానాడుకు హాజరైన ఎమ్మెల్యే

విశాలాంధ్ర-అద్దంకి : బాపట్లలో తలపెట్టిన మినీ మహానాడు ప్రారంభ కార్యక్రమానికి అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ మంగళవారం హాజరయ్యారు. తెదేపా వ్యవస్థాపక అధ్యక్షులు స్వర్గీయ నందమూరి తారకరామారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ పార్లమెంట్ సభ్యులు మాల్యాద్రి, మాజీ మంత్రి నక్కా ఆనందబాబు, బాపట్ల తెదేపా ఇన్‌చార్జి వేగశన నరేంద్రవర్మ తదితరులు పాల్గొన్నారు.

సింగరకొండలో రిసార్ట్స్

విశాలాంధ్ర-అద్దంకి ; పర్యాటక శాఖ ఆధ్వర్యంలో సింగరకొండ వద్ద రీసార్ట్స్‌ను ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీధర్ తెలిపారు. మంగళవారం ఆయన రీసార్ట్స్ నిర్మాణానికి అవసరమైన స్థల పరిశీలకు సింగరకొండ వచ్చి స్థల పరిశీలన చేశారు. గోపాలపురం మలుపు వద్ద 2ఎకరాల స్థల పరిశీలన చేశారు. పర్యాటక శాఖ ఆధ్వర్యంలో భవనాశి చెరువులో అంజనేయస్వామి విగ్రహాన్ని కూడా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రీసార్ట్ నిర్మాణం జరిగితే ఆప్రాంతం అంతా అభివృద్ధి చెందే అవకాశం ఉంది. తహశీల్దార్ సుబ్బారెడ్డి, సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

ఊరచెరువు సుందరీకరణకు రూ.కోటి మంజూరు

విశాలాంధ్ర-అద్దంకి ; అద్దంకి పురపాలక సంఘం పరిధిలోని 20వ వార్డులో 70ఎకరాల విస్తీర్ణంలో విస్తరించి ఉన్న ఊరచెరువు అభివృద్ధికి అర్బన్ గ్రీన్‌వే కార్పోరేషన్ ద్వారా రూ కోటి మంజూరు అయినట్లు అర్బన్ గ్రీన్‌వే కార్పోరేషన్ ఇంజనీరింగ్ అధికారులు ఈశ్వరన్,సర్వేశ్వర్ తెలిపారు. మంగళవారం వారు వార్డు కౌన్సిలర్ గుంజి కోటేశ్వరరావుతో కలసి ఊరచెరువును పరిశీలించారు. ఈసందర్భంగా ఇంజనీరింగ్ అధికారులు మాట్లాడుతూ ఊరచెరువు అభివృద్ధికి 8కోట్లతో ప్రతిపాదనలు పంపగా మొదటి విడతగా రూ.కోటి మంజూరు అయినట్లు తెలిపారు. నిధులతో చెరువు చుట్టూ కట్ట ఏర్పాటు చేయడంతో పాటు చెరువు కట్టమీద వాకింగ్ ట్రాక్ నిర్మాణం, కట్టపై మొక్కలు నాటడం, చెరువు చుట్టూ లైట్ల ఏర్పాటు చేసి చెరువును సుందరీకరణ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఊరచెరువు అభివృద్ధికి శాప్‌నెట్ చైర్మన్ నియోజక వర్గ వైసీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య ప్రభుత్వం నుంచి నిధులు రాబట్టేందుకు కృషి చేసినట్లు గుంజి కోటేశ్వరరావు తెలిపారు. మున్సినల్ ఏఈ రోహిణి,వార్డు సచివాలయ ఇంజనీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

విజ్ఞాన సముపార్జనకు గ్రంథాలయాలు దోహదం

విశాలాంధ్ర -నిజాంపట్నం : విజ్ఞాన సముపార్జనకు గ్రంథాలయాలు ఎంతగానో దోహదపడతాయని నిజాంపట్నం శాఖ గ్రంథాలయ అధికారి ఎస్.విజయలక్ష్మి అన్నారు.వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా మంగళవారం స్థానిక శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు వేసవి విజ్ఞాన శిబిరాలను సద్వినియోగం చేసుకుని మరింత పరిజ్ఞానం పెంపొందించుకోవాలని సూచించారు. విద్యార్థులు చదువుతోపాటు విజ్ఞాన నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని చెప్పారు.పాఠశాలకు వేసవి సెలవులు రావడంతో విద్యార్థులు ఇంట్లో ఖాళీగా ఉండకుండా వారిని తల్లిదండ్రులు గ్రంథాలయాలకు తప్పక పంపించాలని ఆమె కోరారు.

ముగిసిన ఎ.పి.ఇ.ఎ.పి సెట్ పరీక్షలు

విశాలాంధ్ర-వేటపాలెం : సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ టీ.సి.యస్. ఐయాన్ సెంటర్‌లో పరీక్షలు విజయవంతంగా నిర్వహించినట్లు కళాశాల సెక్రటరి వనమా రామకృష్ణారావు ఒక ప్రకటనలో తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్ లో ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసి కోర్సులలో అడ్మిషన్ల కోసం నిర్వహించే ఎ.పి. ఇ.ఎ.పి సెట్ - 2023 పరీక్షలు జె.యన్.టి.యు. అనంతపురం ఆధ్వర్యంలో నిర్వహించారన్నారు. పరీక్షలు కళాశాలలోని టి.సి.యస్ అయాన్ సెంటర్ నందు జై.పి.సి ఈ నెల 22 నుండి 23 వరకు రోజుకు 2 షిప్టులలో ఆన్ లైన్లో నిర్వహించినట్లు కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్ డా. యస్.వి.డి అనిల్ కుమార్ తెలిపారు. ఈ పరీక్షలకు పందిళ్లపల్లి ప్రైమరీ హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవసరమైన ప్రాథమిక చికిత్స సౌకర్యాలను అందజేశారు. ఉదయం 235 మందికి గాను 215 మంది, సాయంత్రం 235 మందికి గాను 217 మంది, మొత్తము 470 మందికి గాను 432 మంది అభ్యర్థులు హాజరైనట్లు తెలిపారు. ఈ పరీక్షలకు డా డి. సమీర్ కుమార్ పరిశీలకులుగా వ్యవహరించారు.

వలంటీర్లకు పురస్కారాల ప్రదానం

విశాలాంధ్ర - పర్చూరు : ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తున్న వాలంటీర్లకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సేవా పురస్కారాలను అందించారు. పర్చూరు మండలంలో సేవా వజ్ర ఒకరికి, సేవారత్న అయిదుగురికి, సేవా మిత్ర 256 మందికి ప్రధానం చేశారు. వాలంటీర్లకు ఘన సన్మానం చేసి ప్రశంసా పత్రాలను అందించారు. కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మీదేవి, ఎంపీపీ మేకా ఆనందకుమారి, వైస్ ఎంపీపీలు కోటా ప్రసన్న, పాలేరు వీరయ్య, మాజీ జడ్పిటిసి కొల్లా సుభాష్, నాయకులు మల్లా శ్రీనివాసరావు, ప్రసాదు, ఎంపీటీసీలు, సర్పంచులు, ప్రజాప్రతినిధులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

గోబాణం, జీవామృతంతో తెగుళ్లు తగ్గుముఖం

విశాలాంధ్ర - సంతమాగులూరు : ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో భాగంగా అన్ని రకాల పంటలపై ఆశిస్తున్న తెగుళ్ల ఉధృతిని పులయ బెట్టిన గోబాణం, జీవామృతంతో అరికట్ట వచ్చుని ఏల్చూరు యూనిట్ ఇంఛార్జి డీవీ సుబ్బారావు తెలిపారు. మంగళవారం అడవిపాలెంలో జీవామృతం పులియబెట్టు తయారు విధానాన్ని ఆయన వివరించారు. మూడు రోజుల తర్వాత పులిసిన జీవామృతానికి.. పది రోజులు పులియబెట్టిన గోబాణాన్ని కలిపి అన్ని రకాల పంటలపై ఆశించిన తెగుళ్లను అరికట్టే అద్భుత శిలీంద్ర నాశకం అని పేర్కొన్నారు. ఆకు, కాయ మచ్చ, ఎండు, బూడిద తెగుళ్లతో పాటు అన్ని రకాల వైరస్ లను సమర్ధవంతంగా నివారిస్తుందని తెలిపారు. గోబాణంలో లాక్టో యాసిడ్ బ్యాక్టీరియా తయారవుతుంది. అలాగే జీవామృతంలోనూ మొక్కలకు మేలు చేసే కోట్లాది సూక్ష్మజీవుల సంవర్ధకం వృద్ధి చెందుతుందని తెలిపారు.ఈ రెండు కలిపిన ద్రావణాన్ని పంటలపై పిచికారీ చేయడం ద్వారా ఆశాజనకంగా ఉంటుందని చెప్పారు. అంతేకాకుండా పంట ఎలాంటి సందర్భంలోనూ బెట్టకు రాకుండా చేస్తుందని తెలిపారు.

విద్యుత్ చార్జీల పెంపునకు నిరసన

విశాలాంధ్ర-పెద్దదోర్నాల : రాష్ట్రంలో విపరీతంగా పెరిగిన కరెంట్ కోతలు మరియు విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు, యర్రగొండపాలెం తెలుగుదేశం పార్టీ ఇంఛార్జి గూడూరి ఏరిక్షన్ బాబు ఆదేశాలు మేరకు పెద్దదోర్నాల మండలం తెలుగు దేశం పార్టీ అధ్యక్షులు యేర్వ మల్లికార్జునరెడ్డి అధ్వర్యములో మండలం లోని 133/32కెవి సబ్ స్టేషన్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు.

బాపట్లలో నాసిరకంగా డ్రైనేజీ నిర్మాణాలు

- అధికారులు, కాంట్రాక్టర్లు, నాయకులు కుమ్మక్కు
- బాధ్యతగా వ్యవహరించకుంటే పోరాటం
- సీపీఐ సీనియర్ నాయకులు జేబీ శ్రీధర్

విశాలాంధ్ర - బాపట్ల : బాపట్ల మున్సిపాలిటీలో డ్రైనేజీ నిర్మాణాలు నాసిరకంగా ఉన్నాయని సీపీఐ జిల్లా నాయకులు జేబీ శ్రీధర్ ఆరోపించారు. పట్టణంలో నిర్మాణంలో ఉన్న డ్రైనేజీలను మంగళవారం పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. శ్రీధర్ మాట్లాడుతూ బాపట్ల జిల్లాగా ఆవిర్భవించిన తరువాత నూతనంగా చేపడుతున్న డ్రైనేజీల నిర్మాణంలో కాంట్రక్టర్లు నాసిరకం సిమెంట్, మార్కాపురం బలపాల పొడి, తక్కువ సామర్థ్యం కల్గిన ఇనుము, కంకర ఇటుక రాయితో గోడ మందం లేకుండా నిర్మాణం చేస్తున్నారన్నారు. డ్రైనేజీల నిర్మాణం విషయంలో బాపట్ల మున్సిపల్ అధికారులు, కాంట్రక్టర్లు, అధికార పార్టీ నాయకులు అంతా కుమ్మక్కై ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారన్నారు. డ్రైనేజీ నిర్మాణాలు నాసిరకంగా చేపట్టడం వలన చిన్నపాటి వర్షానికే మురుగు నీరు లీకేజై దుర్వాసన వచ్చి వ్యాధులు ప్రభలే అవకాశం ఉంటుందన్నారు. డ్రైనేజీ పక్కన ఉన్న షాపుల యజమానులు నాణ్యమైన నిర్మాణం చేయమని అడిగినందుకు లక్ష రూపాయలు నగదు, సిమెంట్, ఇనుము ఇవ్వండిని అడగటం సిగ్గుచేటన్నారు. అధికారులు, కాంట్రాక్టర్లు, మున్సిపల్ కమిషనర్ ఏసీ రూముల్లో ఉండి కాలవనిర్మాణ విషయంలో ఏమాత్రం బాధ్యతగా వ్యవహరించకుండా పర్యవేక్షణను లేకుండా బాపట్ల మున్సిపల్ పౌరులకోట్ల రూపాయల ప్రజాధనాన్ని వృధా చేస్తున్నారని మండిపడ్డారు. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోకపోతే సీపీఐ తీసుకునేటువంటి చర్యలకు అధికారులు, కాంట్రాక్టర్ బాధ్యత వహించవలసి వస్తుందని జెల్డీ భాగ్య శ్రీధర్ హెచ్చరించారు.

సాంకేతిక పరిజ్ఞానంతో భౌతిక ఆధారాల సేకరణ సులభం

- అత్యాధునిక పరికరాల వినియోగంపై శిక్షణ పొందిన పోలీసులు
- సర్టిఫికేట్‌లు అందజేసిన ఎస్పీ వకుల్, ఆర్.ఎఫ్.ఎస్.ఎల్ డైరెక్టర్ వీరకుమారి

విశాలాంధ్ర - బాపట్ల : సాంకేతిక పరిజ్ఞాన్ని సమర్థవంతంగా వినియోగించుకొని భౌతిక ఆధారాలను సేకరించాలని ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యా లయంలో భౌతిక ఆధారాలు సేకరణలో అత్యాధునిక పరికరాల వినియోగంపై శిక్షణ పొందిన జిల్లా పోలీసులకు ఎస్పీ వకుల్‌జిందాల్ విజయవాడ రీజనల్ ఫోరెన్సిక్ సైన్స్ లాబరేటరీ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్.వీర కుమారిలు సర్టిఫికెట్‌లు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ వకుల్ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో నేరస్థులు చేసిన నేరాలను కప్పి పుచ్చుకోవడానికి చట్టాల నుండి తప్పించుకోవడానికి నేర స్థలములో భౌతిక సాక్షాదారాలను రూపుమాపడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. అటువంటి పరిస్థితులలో సహజమైన పద్ధతిలో నేర స్థలములో భౌతిక సాక్షాధారాలు సేకరించడానికి చాలా శ్రమపడవలసి వస్తుందన్నారు. ఇటీవల వచ్చిన అధునాతన సాంకేతిక పరికరాలను ఉపయోగించి సులువుగా భౌతిక సాక్షాదారాలను సేకరించడానికి అవకాశం ఉంటుందని దీనికై జిల్లాలోని పలువురు పోలీసు అధికారులకు, సిబ్బందికి శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. అత్యాధునిక పరికరాలను ఉపయోగించి భౌతిక సాక్షాదారాలను సేకరించుటలో జిల్లా పోలీసులను నిష్ణాతులగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో జిల్లా ఫింగర్ ప్రింట్ యూనిట్, క్లూస్ టీమ్‌కు చెందిన ఎస్ఐ టి.శ్రీనివాసరావును 5 గురు పోలీస్ కానిస్టేబుల్‌లను ఏపీ ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీ ఆధ్వర్యంలో రీజనల్ ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీ విజయవాడలో నిర్వహించిన క్రైమ్ సీన్ ప్రాసెసింగ్ శిక్షణకు ఎంపికచేసి పంపినట్లు ఎస్పీ తెలిపారు. వీరికి విజయవాడ రీజనల్ ఫోరెన్సిక్ సైన్స్ లాబరేటరీ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్.వీర కుమారి సైంటిఫిక్ అసిస్టెంట్ వై.సూర్యనారాయణ శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. శిక్షణ సమయంలో సాధారణ పరిస్థితులలో సేకరించడానికి వీలుకాని వేలిముద్రలను, కంటికి కనిపించని వేలిముద్రలను 4కె మొబైల్ మల్టీస్పెక్టర్ ఫింగర్ ప్రింట్ డిటెక్షన్ టాబ్లెట్ ద్వారా సులువుగా ఫోటో తీసుకొని దానిని విశ్లేషించడం అసహజమైన పరిస్థితులలో సాధారణ కెమెరాలను వినియోగించలేని ప్రదేశాలలో నేరస్థలం మొత్తాన్ని వీడియోలు, ఫోటోలు తియ్యడానికి ఉపయోగించే 3డి స్కానర్ వినియోగించు విధానంతో పాటు సహజంగా ఎరుపు రంగు దుస్తులపై ఉన్న రక్తపు మరకలు, తెలుపు రంగు దుస్తులపై ఉన్నసెమెన్ మన కంటికి కనిపించని వాటిని సేకరించే విధానంపై శిక్షణ పొందారన్నారు. ఏదైనా నేరస్థలములో రక్తపు మరకలను తుడిచివేసిన మొబైల్ మల్టీ స్పెక్ట్రల్ యూవివిఐఎస్ ఐఆర్ ఇమేజింగ్ సిస్టమ్‌ను వినియోగించి కంటికి కనిపించని రక్తపు మరకలను, సెమెన్ వంటి వాటిని గుర్తించి సేకరించే విధానంలో శిక్షణ పొందినట్లు తెలిపారు. నేరస్తులు నేరాలు చేసే తీరు రోజురోజుకీ మారి పోతుందని వారు చేసిన నేరాన్ని కోర్టులో నిరూపించాలంటే నేరస్థలంలో సేకరించిన భౌతిక సాక్షాదారాలు ఎంతో కీలకంగా ఉపయోగపడతాయన్నారు. సాంకేతిక పరిజ్ఞాన్ని సమర్థవంతంగా వినియోగించుకొని భౌతిక ఆధారాలను సేకరించా లన్నారు. ఎప్పుడైతే ముద్దాయికి నేరం చేసినప్పుడు కచ్చితంగా పోలీసులకు పట్టుబడతాము అనే భయం ఉంటే నేరం చేయటానికి భయపడతాడని తెలిపారు. ఈ కార్యక్రమంలో విజయవాడ రీజనల్ ఫోరెన్సిక్ సైన్స్ లాబరేటరీ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్.వీర కుమారి, సైంటిఫిక్ అసిస్టెంట్ వై.సూర్య నారాయణ, ఫింగర్ ప్రింట్ యూనిట్ క్లూస్ టీమ్ ఎస్ఐ టి. శ్రీనివాసరావుపాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

విశాలాంధ్ర - బల్లికురవ : పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని పర్యావరణహిత జీవనంతో ఆరోగ్యకర సమాజం ఏర్పడుతుందని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అటవీశాఖ ఫారెస్టే సెక్షన్ ఆఫీసర్ వై జాన్సన్,వేటపాలెం ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ కె.రమేష్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని కొప్పెరపాడు గ్రామ సమీపంలో రైతులు, ఉపాధి హామీ కూలీలకు కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో పర్యావరణ హిత జీవనశైలిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలందరు పర్యావరణ హిత జీవనశైలిని అలవర్చుకోవాలి కోరారు. పర్యావరణహితానికి సింగల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని, వాటి స్థానంలో బట్ట బ్యాగులు వినియోగించాలని,నీటిని సంరక్షించే వ్యవసాయ పద్ధతులు పాటించాలని, వర్షపు నీరు ఆదా చేయుడం,నీటిని వృధా చేయకూడదని,విద్యుత్ పొదుపుకు సిఎల్ఎఫ్,ఎల్ఈడి బల్బులు వినియోగించాలని,పారిశుధ్య నిర్వహణ,తడి,పొడి చెత్త వేరు చేసి ఇవ్వడం, పరిసరాల పరిశుభ్రత, స్వచ్ఛ వాయువుల కోసం ఎక్కువ చెట్లు నాటడంతో పర్యావరణాన్ని పరిరక్షించగలుగుతామన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ బీట్ ఆఫీసర్ శ్రీనివాస్ ఉపాది కూలీలు మరియు కొప్పెరపాడు గ్రామ రైతులు హాజరు అయ్యారు.

ప్రజలతో సీఎం జగన్ మూడు ముక్కలాట

- జగన్‌ను తరిమి కొడితేనే రాష్ట్ర భవిష్యత్తు
- బాపట్ల మినీ మహానాడులో టీడీపీ నేతలు

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : మూడు రాజధానులు పేరుతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి మూడు ముక్కలాడుతూ రాష్ట్ర ప్రజలను దగా చేస్తున్నారని మంగళవారం రాత్రి బాపట్ల మినీ మహానాడులో టిడిపి నేతలు మండిపడ్డారు. బాపట్ల తేదేపా ఇంచార్జీ వేగేశన నరేంద్ర వర్మ రాజు నేతృత్వంలో రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు ఆదేశాలు మేరకు మిని మహానాడు కార్యక్రమంను స్థానిక తేదేపా కార్యాలయం నందు ఘనంగా నిర్వహించారు. సభా వేదికపై ఉన్న బాపట్ల జిల్లా తేదేపా తాజా,మాజీ ఎమ్మెల్యే లు,మాజీ పార్లమెంట్ సభ్యులు వేదికపై యన్ టి ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం నరేంద్ర వర్మ రాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాజీ మంత్రి నక్కా ఆనందబాబు మాట్లాడుతూ మాట్లాడుతూ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు యన్ టి ఆర్ శత జయంతి ఉత్సవాలను ప్రపంచవ్యాప్తంగా ఒకేసారి 100 చోట్ల నిర్వహించడం స్వర్గీయ ఎన్టీ రామారావుకి దక్కిన ఘనమైన కీర్తి అన్నారు . నాడు ఎన్టీఆర్ తెలుగు నాడిని వినిపిస్తే ఆయన వారసుడిగా నారా చంద్రబాబు నాయుడు దేశాన్ని నిర్దేశించగల శక్తివంతమైన పార్టీగా తెలుగుదేశం పార్టీని నిలబెట్టారని తెలియజేశారు. ఎలక్షన్ కోడ్ ఇచ్చిన రెండు రోజులకే సొంత బాబాయిని అత్యంత క్రూరంగా చంపిన చరించని ముఖ్యమంత్రి ఎవరైనా ఉన్నారంటే అది వైఎస్

జగన్మోహన్ రెడ్డి ఒకడేనని దుయ్యబట్టారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్కు చిత్తశుద్ధి ఉంటే చిన్న కోడి కత్తి కేసులో దళితుడైన వ్యక్తిని నాలుగు సంవత్సరాలుగా బెయిల్ రాకుండా, విచారణ పేరుతో గడుపుతూ అధికార దాహంతో ప్రజలపై స్వారీ చేసే విధానాన్ని విడనారాలని సూచించారు. ప్రజలతో మూడుముక్కలాటలాడుతూ, మూడు రాజధానులు అని చెబుతూ, పబ్బం గడుపుకునేటువంటి ముసలి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అని అన్నారు. నరేంద్ర వర్మ రాజు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని తరిమి కొడితేనే రాష్ట్ర భవిష్యత్తు బాగుంటుందని లేదంటే తిరుగతేనని తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఒక్కడే రాష్ట్రానికి దిశా దశ నిర్దేశించగల నాయకుడని వేగేశన కొనియాడారు. తెలుగుదేశం పార్టీ జిల్లా ఇన్చార్జి ఏలూరు సాంబశివరావు అనారోగ్య కారణంగా తన సందేశాన్ని పంపారు. సందేశంలో ఎన్టీఆర్ త్యాగనిరతి నీ కొనసాగిస్తూ రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ సుస్థిర స్థానాన్ని సంపాదించుకునే స్థాయికి తీసుకొచ్చిన మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు యొక్క ఆదేశాలు మేరకు ఈ మినీ మహానాడు ను ఘనంగా జరుపుకోవడం తెలుగుదేశం పార్టీ కుటుంబంలో శుభకార్యమని అభిప్రాయపడ్డారు. రాష్ట్రాన్ని పాలిస్తుంది సిబిఐ దత్తపుత్రుడు, పలు కేసుల్లో నిందితుడు గా పరిగినించాల్సిన వ్యక్తి మన ముఖ్యమంత్రి కావడం దురదృష్టకరమన్నారు. ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ ఎన్టీఆర్ ఆశయ సాధనాలను నారా చంద్రబాబు నాయుడు ఒక్కడే కొనసాగించగలరని, స్థానిక బాపట్ల ఇన్చార్జి నరేంద్ర వర్మ రాజును అఖండ మెజార్టీతో గెలిపించి జిల్లాలోని ఆరు నియోజకవర్గాలలో దేశం పార్టీ జెండా ఎగరవేయాలని పార్టీ శ్రేణులను నాయకులను, అభిమానులను కోరారు. అనంతరం బాపట్ల ఇంచార్జ్ వేగేసిన నరేంద్ర వర్మ రాజు జన్మదినాన్ని పురస్కరించుకొని భారీ కేకును కట్ చేసి శుభ కాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చీరాల ఇన్చార్జి మాల కొండయ్య, విజయ్ కుమార్, బాపట్ల పార్లమెంటు మాజీ సభ్యులు శ్రీరామ్ మాల్యాద్రి, రాజశేఖర్ బాబు, సరోజిని, మనం విజేత, తానికొండ దయా బాబు, తాత జయప్రకాష్ నారాయణ, మామిడి భాస్కరరావు, మందపాటి ఆంద్రీయ, సలగల సురేష్, వంశి, కూచిపూడి శ్యాంసుందర్, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలకు ప్రభుత్వ ప్రోత్సాహం

విశాలాంధ్ర - బాపట్ల రూరల్ : ప్రజలకు ఉత్తమ సేవలు అందించే వాలంటీర్లకు ప్రభుత్వం గుర్తింపు ఇచ్చి ప్రోత్సహిస్తుందని ఎమ్మెల్యే కోన రఘుపతి తెలిపారు. మండలంలోని బేతపూడి, స్టువర్టుపురం, కొత్తపాలెం, గ్రామాలలోని వార్డు వాలంటీర్ల సేవలకు ప్రభుత్వం అందిస్తున్న సేవా మిత్ర సేవా రత్న సేవా వజ్ర పురస్కారాలను ఎమ్మెల్యే కోన రఘుపతి ఎంపికైన వలంటీర్లకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల కన్వినర్ కోకి రాఘవరెడ్డి, ఎస్సీ సెల్ నాయకుడు వడ్డిముక్కల డేవిడ్, గవిని కృష్ణమూర్తి, ఎంపీడీవో రాధాకృష్ణ, ఈవోపీఆర్డీ శరత్‌బాబు తదితరులున్నారు.

20న పాండురంగారావు స్థూపం ఆవిష్కరణ

విశాలాంధ్ర-ఒంగోలు : శ్రీకాకుళం సాయుధ పోరాట యోధుడు,సిపిఐ ఎంఎల్ రాష్ట్ర నాయకుడు టీ పాండురంగారావు స్థూప ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఈ నెల 29వ సింగరాయకొండ నిర్వహిస్తున్నట్లు సీపీఐ ఏం.ఎల్ న్యూ డెమొక్రసీ రాష్ట్ర సహాయ కార్యదర్శి చిట్టిపాటి వెంకటేశ్వర్లు తెలిపారు.ఈ సందర్భంగా ఒంగోలు లోని స్థానిక శర్మ కళాశాల వద్ద గలా మాదాల నారాయణస్వామి భవనంలో నందు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో స్థూప ఆవిష్కరణ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించి కార్యక్రమ వివరాలు వెల్లడించారు.అనంతరం సిపిఐ ఎంఎల్ న్యూడెమొక్రసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చిట్టిపాటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సాయుధ పోరాట యోధుడు పాండు రంగారావు చేసిన కృషి మరువలేనిదని కొనియాడారు.ఆయన జ్ఞాపకార్థం కొండపి నియోజక వర్గం సింగరాయ కొండ నందు స్థూపాన్ని ఆవిష్కరణ చేస్తున్నట్లు ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో అరుణోదయ రాష్ట్ర అధ్యక్షులు జాలన్న ఉన్నారు.

విశాలాంధ్ర బాపట్ల జిల్లా

మృతుల కుటుంబాలకు బాచిన పరామర్శ

విశాలాంధ్ర - సంతమాగులూరు : మండ లంలోని వెల్లలచెరువు గ్రామంలో ఏపీ శాప్ నెట్ ఛైర్మన్, అద్దంకి వైసీపీ ఇంఛార్జి బాచిన కృష్ణచైతన్య మంగళవారం పర్యటించారు. ఈసందర్భంగా గ్రామ సర్పంచ్ షేక్.సైదాబి మామ షేక్. కొండలు అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న బాచిన వారి నివాసానికి వెళ్లి ఆయన భౌతిక కాయాన్ని సందర్శించి, పూలమాల వేసి నివాళులర్పించారు. సర్పంచ్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం అదే గ్రామానికి చెందిన వైసీపీ నేత తలకొండపాటి శివయ్య మాతృమూర్తి శేషమ్మ రెండు రోజుల క్రితం మృతి చెందిన విషయం తెలిసి.. వారి కుటుంబానికి కృష్ణచైతన్య సానుభూతిని వ్యక్తం చేశారు.

ప్రతి కుటుంబానికి సంక్షేమం జగనన్న లక్ష్యం

విశాలాంధ్ర - పర్చూరు : వైసీపీ పాలనలో ప్రతి కుటుంబానికి సంక్షేమం అందించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అందిస్తున్నారని పర్చూరు వైసీపీ ఇంచార్జ్ ఆమంచి కృష్ణమోహన్ తెలిపారు. మండలంలోని అన్నంబోట్లవారిపాలెం గ్రామ సచివాలయం పరిధిలో గర్నెపూడి, గోరంట్లవారిపాలెం, ఎడారిపల్లి గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా లేదా అని వాకాబు చేశారు. గ్రామాల్లోని గుడిలో పూజా కార్యక్రమంలో పాల్గొని అన్నంబోట్లవారిపాలెం జిల్లా పరిషత్ పాఠశాల అంగన్వాడి కేంద్రంను పరిశీలించారు. అనంతరం వైయస్సార్ రైతు రథం పథకం ట్రాక్టర్ ను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. గ్రామంలోని రోడ్లు,డ్రైనేజీ, కాలువలు, ప్రజా సమస్యలు ప్రజల నుంచి తెలుసుకుని త్వరితగతిన పరిష్కరించే విధంగా కృషి చేస్తాను అని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పర్చూరు గర్నెపూడి సర్పంచ్ బిరుదు నాగేంద్రమ్మ, గోరంట్ల భాస్కర్ రావు, పర్చూర్ మండల కన్వీనర్ కటారి అప్పారావు, వంకాయలపాటి వీరయ్య, గోరంట్ల శివకుమారి, కొనకంచి సుబ్బారావు, చిన్నపాటి నాగేశ్వరరావు, తోకల కృష్ణమోహ,దగ్గుబాటి రామకృష్ణ, ఉప్పలపాటి అనిల్ చౌదరి, గోరంట్ల బాబు, రామకృష్ణ,గన్నేటి సత్యనారాయణ , పఠాన్ అక్బర్ , ఆలనేటి చెన్నయ్య, విష్ణుమూర్తి, మాజీ సర్పంచ్ గోరంట్ల సత్యనారాయణ, మరియు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

16వ రోజుకు వేసవి విజ్ఞాన శిబిరాలు

విశాలాంధ్ర - సంతమాగులూరు : మండల కేంద్రం సంతమాగులూరు గ్రంథాలయం శాఖలో వేసవి విజ్ఞాన శిబిరాలు 16వ రోజు మంగళవారం కొనసాగాయి. గ్రంథపాలకుడు బాదం విజయ భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో 31 మంది పిల్లలు పాల్గొని పుస్తక పఠనం చేశారు. ఆట వస్తువులు, నీతి కథల పుస్తకాలు, జనరల్ నాలెడ్జ్ పలు పుస్తకాల ప్రదర్శన నిర్వహించారు. అనంతరం పిల్లలతో పుస్తకాలు చదివించారు. లైబ్రరీలో ఎక్కువ మంది బాలబాలికలు వచ్చే విధంగా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

అమ్మ ఆశ్రమం నిర్మాణానికి సహాయం

విశాలాంధ్ర - మార్టూరు : స్థానిక అమ్మ ఆశ్రమం నూతన భవన నిర్మాణానికి ఉపాధ్యాయులు అడుగుల శ్రీనివాసరావు అడుగుల సూర్యప్రకాష్ రావు అడుగుల చంద్రశేఖర్ మార్టూరు పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న అడుగుల హరిబాబు సోదరులు ఆశ్రమ అధ్యక్షులు గుంటుపల్లి చందు విజయలక్ష్మి దంపతులకు రూ. 25 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. గత మూడు సంవత్సరాలుగా వృద్ధులకు అన్నదానం నిర్వహిస్తూ వారి వసతి కొరకు నిర్మిస్తున్న నూతన భవనానికి ఈ సహాయం అందిస్తున్నట్లు భవిష్యత్తులో మరికొంత ఆర్థిక సహాయాన్ని అందజేస్తామని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి అడుగుల శ్రీనివాసరావు తెలియజేశారు.దాతల సహకారంతో ఈ ఆశ్రమ నిర్మాణం జరుగుతుందని వారికి ఆశ్రమ అధ్యక్షులు గుంటుపల్లి చందు ధన్యవాదాలు తెలియజేశారు.

కొనసాగుతున్న వేసవి విజ్ఞాన శిబిరం

విశాలాంధ్ర - మార్టూరు : మార్టూరు గ్రంథాలయం నందు మంగళవారము వేసవి విజ్ఞాన శిబిర (తరగతులు) కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఈ కార్యక్రమం విద్యార్థినీ,విద్యార్థులు కథలు చదివించటం, కథలు చెప్పించారు. విద్యార్థినీ, విద్యార్థులకు పాటలు, క్యారం బోర్డ్, సెస్,లుడో, పోటీలు నిర్వహించామని గ్రంథాలయ పాలకులు పి.జె. రామారావు తెలిపారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడులు

విశాలాంధ్ర - సంతమాగులూరు : కొమ్మాలపాడు గ్రామ శివారు పొలాల్లో గుట్టుచప్పుడు కాకుండా నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై పోలీసులు మంగళవారం దాడులు నిర్వహించారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్సై ఎం.వి.శివకుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది పేకాట శిబిరంపై దాడి చేసి ఐదుగురు జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.21,630 నగదు, నాలుగు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలం పరిధిలోని గ్రామాల్లో ఎవరైనా జూదం, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వేసవి శిక్షణా విద్యార్థులకు ఉపయోగకరం

విశాలాంధ్ర-అద్దంకి ; అద్దంకి శాఖా గ్రంథాలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణా తరగతులు విద్యార్థులకు ఉపయోగకరం అని గ్రంథ పాలకుడు చుండూరి సుగుణరావు అన్నారు. అద్దంకి శాఖా గ్రంథాలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణా తరగతులు మంగళవారం 16వ రోజుకు చేరాయి. మంగళవారం సృజన అధ్యక్షులు గాడేపల్లి దివాకరదత్తు విద్యార్థులకు ఫిజిక్స్‌పై శిక్షణ ఇచ్చారు. క్విజ్ పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

ఏఎస్ఐ హసన్ సాహెబ్ గుండెపోటుతో మృతి

విశాలాంధ్ర-కొనకనమెట్ల : కొనకనమిట్ల మండల పోలీస్ స్టేషన్లో ఏఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న ఎస్‌కె హసన్ సాహెబ్ 59 గుండెపోటుతో మృతి చెందారు. సోమవారం రాత్రి ఒకసారిగా చాతిలో నొప్పి రావడంతో పొదిలిలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. ఈయన గతంలో కూడా కొనకనమెట్ల పోలీస్ స్టేషన్లో కానిస్టేబుల్‌గా కూడా పనిచేశారు.